ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు





గురువారం 16 మే 2024



కాలిబూడిదైన బస్సు, టిప్పర్

కొన్ని గంటల ముందు వరకు అమ్మమ్మ, తాతయ్యకు కబుర్లు చెబుతూ ఆడుకుంది ఆ పాప.. బుజ్జిబుజ్జి మాటలకు మురిసిపోతూ మెల్లిగా మనవరాలితో కలిసి నిద్రలోకి జారుకున్నారు.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఓటేయడానికి వచ్చిన ఓ యువకుడు అప్పుడే అమ్మానాన్నతో మాట్లాడి రెప్పవాల్చారు.. పిల్లల చదువుల కోసం హైదరాబాద్ లో ఉంటూ ఓట్ల పండగలో పాల్గొనడానికి స్వగ్రామం బాట పట్టి తిరుగు ప్రయాణమయిన వ్యక్తి మరొకరు... ఇలా అందరూ దాదాపుగా ఓటేయడానికి సొంతూరి బాట పట్టి హైదరాబాద్‌కు తిరుగుపయనమయిన వారే ఆ బస్సులో ఉన్నారు.

# అర్ధరాత్రి ఘోరం




మృతి చెందిన కాశీ బ్రహ్మేశ్వర రావు
ఆయన మనుమరాలు ఖ్యాతి సాయి



మృతి చెందిన లక్ష్మి



మృతి చెందిన శ్రీనివాసరావు

తెల్లవారుజాము 1.30 గంటలు

బస్సులో అంతా నిద్రావస్థలో ఉన్నారు. అకస్మాత్తుగా ఎదురుగా వస్తున్న గ్రావెల్ లోడుతో ఉన్న టిప్పర్ ఆ బస్సును ఢీకొంది. ప్రమాద ధాటికి టిప్పర్ డీజిల్ ట్యాంకర్ పేలిపోయి మంటలు ప్రారంభమయ్యాయి. క్షణాల్లో ఆ మంటలు బస్సుకు అంటుకున్నాయి. బస్సులోని ప్రయాణికులు ఈ హఠాత్పరిణామానికి నివ్వెరపోయారు. ఆర్తనాదాలు చేస్తూ బస్సు దిగి రావడానికి ప్రయత్నించారు. వీరిలో కొందరు బస్సు దిగిరాగా మరికొందరు బస్సులోనే చిక్కుకు పోయారు. టిప్పర్, ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులోని ప్రయాణికులు నలుగురు సజీవ దహనం అయ్యారు.

- గ్రావెల్ లోడు టిప్పర్ - బస్సు ఢీ
- మంటలలో చిక్కుకున్న ట్రావెల్స్ బస్సు
- ఆరుగురి సజీవ దహనం ● మృతుల్లో ఓ చిన్నారి
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆహుతి
- చిలకలూరిపేటకు సమీపంలో ఘటన
- ఓటు వేసి హైదరాబాద్ తిరిగి వెళుతుండగా విషాదం
- సంఘటనా స్థలంలో భీతావహ దృశ్యాలు

## బస్సులోనే.. సజీవ దహనం

చిలకలూరిపేట, చినగంజాం, పర్చూరు, బాపట్ల, గుంటూరు, మే 15: పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు సమీపంలో బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు సజీవ దహనం అయ్యారు. చీరాల చిలకలూరిపేట మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. బాపట్ల జిల్లా చినగంజాం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం డొంక సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొంది. టిప్పర్ ఆయిల్ ట్యాంకు పగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు పూర్తిగా తగలబడి పోగా, టిప్పర్ ధ్వంసమైంది. చిలకలూరిపేట 108 వాహనం సిబ్బంది అక్కడకు చేరుకుని 29 మంది గాయపడినట్టుగా గుర్తించారు. వారికి ప్రాథమిక చికిత్స చేశారు. వీరిలో 20 మందిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉన్నారు. వారిలో నీలాయపాలెం గ్రామానికి చెందిన భార్య భర్తలు ఉప్పుగుండూరి కాశీ బ్రహ్మేశ్వరరావు(64), లక్ష్మి(55), వారి మనుమరాలు ముప్పరాజు ఖ్యాతి సాయిని(8), గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు(52)తో పాటు చీరాలకు చెందిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అంజి (35), టిప్పర్ డ్రైవర్ మధ్యప్రదేశ్‌కు చెందిన హరిసింగ్ (39) మృతుల్లో ఉన్నారు.

### రెప్పపాటులో తీవ్ర విషాదం

టిప్పర్ ఢీకొన్న ఘటనలో క్షణాల్లో మంటలు వ్యాప్తితో రెప్పపాటులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏం జరిగిందో తెలుసుకునే లోపలే బస్సును మంటలు చుట్టుముట్టాయి. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులకు ఏం జరుగుతుందో అర్థం కాక ప్రాణాలు కాపాడుకునేందుకు ఎవరికి తోచినట్లు వారు కిటికీల్లో నుంచి అద్దాలు పగలగొట్టుకొని కిందకు దూకేశారు. వయసు రీత్యా పెద్దవారైనా కాశీబ్రహ్మేశ్వరరావు లక్ష్మీ దంపతులకు ఏం చేయాలో పాలుపోలేదు. ఇంతలో భావన చిన్నారి ఖ్యాతి శ్రీసాయిని వెంటబెట్టురేని కిందకు దిగేందుకు మెయిన్ డోర్ వద్దకు వెళ్లారు. అయితే మెయిన్ డోర్ విరిగి లోపలికి పడడంతో పాటు మంటలు ఎగిసి పడడంతో అటు నుంచి కిందకు దిగడానికి సాధ్యం కాలేదు. అదే సమయంలో వెనకవైపు కిటికీ అద్దాలు పగలగొట్టి కిందకు దిగుతున్నట్లు తెలుసుకున్న భావన చిన్నారి చేయి పట్టుకుని అటువైపు వెళ్ళింది. ఎగిసి పడుతున్న మంటలు.. హాహాకారాలతో భయపడిన చిన్నారి ఎటుపోవాలో అర్థం కాక తాతయ్య అంటూ కాశీ బ్రహ్మేశ్వరరావు వద్దకు వెళ్ళింది. దీంతో చిన్నారిని లాక్కొంచేందుకు భావన ప్రయత్నించింది. అప్పటికే పరిస్థితి చేయి దాటి పోతుండడంతో బయటకు దిగిన ప్రయాణికులు భావనను బలవంతంగా కిటికీ నుంచి బయటకు లాగేశారు. దీంతో భావన ప్రాణాలతో బయట పడింది. బస్సులో చిక్కుకుపోయిన కాశీ బ్రహ్మేశ్వరరావు లక్ష్మిలతో పాటు వారి మనవరాలు ఖ్యాతి అగ్నికి ఆహుతయ్యారు. ప్రమాదం నుంచి మృత్యుంజయురాలైన భావన ప్రస్తుతం గుంటూరులోని రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.






చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



- **షాక్‌కు గురయ్యాం : తాటి సాయిలక్ష్మి, సోపిరాల**

చినగంజాంలో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో బస్సు ఎక్కాం. గంటసేపు ప్రయాణించగానే ప్రమాదానికి గురైంది. నిద్రమత్తులో ఏమి జరిగిందో తెలుసుకునే లోపే మంటలు వ్యాపించాయి. బుధవారం హైదరాబాద్‌లో ఇంటర్వ్యూకి హాజరు కావాల్సి ఉంది. భగవంతుడి దయవల్ల ప్రాణాపాయం తప్పింది.

- **కళ్ల ముందే దగ్ధమైంది : టి.రాజ్యలక్ష్మి, మమత**

బస్సులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బస్సులో మంటలు, బయట చిమ్మచీకటి ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రాణాలు దక్కించుకునేందుకు కొంతమంది కాలుతున్న ద్వారం గుండా, కొంతమంది కిటికీ అద్దాలు పగలుకొట్టుకుని బయటకు దూకారు. మేము తప్పించుకుని బయటకు వచ్చేలోపే బస్సు కళ్ల ముందే దగ్ధమైంది.

### అర్ధరాత్రి స్పందించిన ఏలూరి

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో సంఘటన స్థలం వద్దకు వచ్చారు. క్షతగాత్రులను తన వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున 5 గంటల వరకు ఆయన సంఘటనా స్థలంలోనే ఉన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రి విడదల రజిని ప్రమాదం జరిగిన తీరును చూసి చలించి పోయారు. మృతులకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని పుల్లారావు డిమాండ్ చేశారు. పక్కనే జరుగుతున్న ఓడరేవు నకరికల్లు రోడ్డు విస్తరణ పనుల గుత్తేదారు సరైన భద్రత, సూచికల ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఆ క్రమంలోనే టిప్పర్ ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ బస్సును ఢీకొంది. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడన్న అనుమానాలున్నాయి.



రోధిస్తున్న బంధువులు





ప్రమాద స్థలంలో పరిశీలన జరుపుతున్న అడిషనల్ డీజీ శంఖబ్రత బాగ్చి, గుంటూరు ఎస్పీ తుషార్ డూడి

### సంఘటనా స్థలంలో అధికారులు

ప్రమాదం గురించి తెలిసిన వెంటనే చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఘటనాస్థలికి వచ్చారు. అగ్నిమాపక దళం మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా అప్పటికే బస్సు పూర్తిగా తగలబడింది. బస్సులోని నలుగురు ప్రయాణికులు గుర్తుపట్టలేని రీతిలో మాంసపు ముద్దలుగా మిగిలారు. వీరితోపాటు టిప్పర్ డ్రైవర్, బస్సు డ్రైవర్ కూడా సజీవ దహనమయ్యారు. అడిషనల్ డీజీ శంఖబ్రతబాగ్చీ, గుంటూరు ఎస్పీ తుషార్ డూడి, నరసరావుపేట డీఎస్పీ వర్మ, నరసరావుపేట ఆర్డీవో సరోజిని, చిలకలూరిపేట ఆర్డీవో నాగలక్ష్మి తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహపు భాగాలను బంధువులకు అప్పగించారు.

### బిడ్డను కోల్పోయి రోదిస్తున్న వెంకట సుబ్బారావు

ముప్పరాజు వెంకట సుబ్బారావు అనే వ్యక్తి ఒంగోలులోని సిరి చందన స్కానింగ్ సంస్థలో పనిచేస్తుంటారు. వారి కుమార్తె ముప్పరాజు ఖ్యాతి సాయి (8). ఆ పాప మూడవ తరగతి వరకు చదువుకుంది. నాలుగవ తరగతిలో చేరటానికి సిద్ధంగా ఉన్న సమయంలో వేసవి సెలవులు వచ్చాయి. తాతయ్య అమ్మమ్మలతో కలిసి కొద్దిరోజులు హైదరాబాదులో ఉండడానికి బస్సులో వారితో బయలుదేరింది. ఈ ప్రమాదంలో ఆ పాప మృతి చెందడంతో వెంకట సుబ్బారావుతో పాటు ఆయన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### పలువురుకి గాయాలు

చినగంజాం: స్వగ్రామంలో ఓటు వేసి వెళ్తుండగా జరిగిన ఘటనలో చినగంజాం మండలానికి చెందిన నలుగురు సజీవ దహనమవగా పలువురు గాయపడ్డారు. పసుమర్రు వద్ద జరిగిన దుర్ఘటనలో నీలాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు కాశీబ్రహ్మేశ్వరావు(65), ఆయన భార్య లక్ష్మి(55), మనవరాలు ముప్పరాజు సాయికార్తిశ్రీ(8), గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసులు(53) బస్సులో సజీవ దహనమయ్యారు. గొనసపూడి గ్రామానికి చెందిన యాముల ఆకాష్, గడ్డిపూడి తేజ, కడవకుదురుకి చెందిన గొల్లపూడి ఉదయభాను, తాటి రాజ్యలక్ష్మి, చినగంజాం పంచాయతీ అంబేద్కర్ నగర్‌కు చెందిన మేడికొండ అంకయ్య, మేడికొండ సౌజన్య, మేడికొండ అక్షయ, బొలిమేర సుధాకర్, బడుగు సంజన, సోపిరాల గ్రామానికి చెందిన తాటి సాయిలక్ష్మీ, దొడ్డా మమత, కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్‌కు చెందిన వాయిల అంజలి, రామచంద్రానగర్‌కు చెందిన పెద్దశింగు నాగరాజు, ఆయన భార్య లక్ష్మి, కుమారుడు ఈశ్వరసాయి, బొమ్మిడి మాలతి, మోటుపల్లి పంచాయతీ పరిధిలోని అడవీధిపాలేనికి చెందిన రాయని బాలాజీ, నీలాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు భావన, కన్నెగంటి స్మైలీ, సామినేని సింధుజ, ఆమెభర్త అంజిబాబులకు గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ ఘనతో ఆయా గ్రామాల్లో విషాదం అలుముకుంది. గొనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో హైదరాబాదులో ఉంటున్నారు. గ్రామంలోని పొలాలను కౌలుకు ఇచ్చి వాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ, హైదరాబాద్‌లో పిల్లలను చదివించుకుంటున్నారు. గ్రామంలో ఓటు వేయడానికి కుటుంబసభ్యులతో వచ్చారు. శ్రీనివాసరావు భార్య అంజమ్మ, కుమారుడు సోమవారం రాత్రి హైదరాబాదు వెళ్లారు. మంగళవారం రాత్రి శ్రీనివాసరావు హైదరాబాదు వెళ్తూ సజీవ దహనమయ్యారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న పోలీసులు

# పోలింగ్ 85.15%

**మండేఎండలకు తోడు పాలకపార్టీ శ్రేణులు అరాచకాలను లెక్క చేయకుండా ఓటర్లు బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా నమోదైన పోలింగ్ శాతం చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా మూడో స్థానంలో బాపట్ల జిల్లా నిలిచింది. మే 13న జరిగిన పోలింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ మరింత ఊపందుకోవడం వల్లే ఈ స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. ముఖ్యంగా అర్ధరాత్రి వరకు జరిగిన పోలింగ్ నియోజకవర్గాల్లో చీరాల, అద్దంకి ఉన్నాయి.**

- అద్దంకిలో అత్యధికంగా 88.25 శాతం నమోదు
- పోటెత్తిన మహిళా ఓటర్లు, వారిదే అగ్రస్థానం
- పోస్టల్ బ్యాలెట్‌ను కూడా కలుపుకొంటే 86.45 శాతం
- ప్రతికూల పరిస్థితులను లెక్క చేయకుండా కదలిన ఓటర్లు

బాపట్ల, మే15(ఆంధ్రజ్యోతి): మండుటెండను సైతం లెక్కచేయకుండా, పాలకపార్టీ శ్రేణుల దౌర్జన్యాలకు వెరవకుండా పెద్దఎత్తున బారులు తీరిన ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్న సంగతి తెలిసిందే. పోలింగ్‌కు సంబంధించి నియోజకవర్గాలతో పాటు బాపట్ల జిల్లాలో నమోదైన పోలింగ్ శాతాలను ఎన్నికల కమిషన్ బుధవారం ప్రకటించింది. బాపట్ల జిల్లావ్యాప్తంగా 85.15 పోలింగ్‌శాతం నమోదవగా, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా కలుపుకుంటే ఈ శాతం 86.45గా నమోదైంది. ఇక బాపట్ల పార్లమెంట్‌లోని సంతనూతలపాడును కలుపుకుంటే 85.48 శాతంగా, పోస్టల్ బ్యాలెట్‌ను కూడా కలుపుకుని 86.72గా ఉంది. 2019 ఎన్నికల్లో బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఓటింగ్ శాతం 86.33గా నమోదు కాగా ప్రస్తుతం 86.72గా నమోదు కావడంతో పెరుగుదల నమోదైంది.



బాపట్లలో ఓట్లు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు

### 12,91,716 ఓటర్లకు గాను..

బాపట్ల జిల్లాలో మొత్తం 12,91,716 ఓటర్లకుగాను పురుషులు 6,29,794 మంది, మహిళలు 6,61,841 మంది ఉండగా ఇతరులు 81గా ఉన్నారు. వీరిలో తమ ఓటు హక్కు నేరుగా వినియోగించుకున్న వారు 10,99,944 మందికాగా ఇందులో 5,61,358 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకుని అగ్రస్థానంలో నిలిచారు. ఇక పురుషుల విషయానికొస్తే ఆ సంఖ్య 5,38,548గా ఉంది. పోస్టల్ బ్యాలెట్‌లు మొత్తం 17,805 ఉండగా ఇందులో 16,767 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ వినియోగం విషయంలో జిల్లాలో 94.17 శాతం నమోదు కావడం గమనార్హం.

### అద్దంకిలో అత్యధికంగా..

అద్దంకిలో మొత్తం ఓటర్లు 2,44,057 మంది ఓటర్లు ఉండగా రికార్డు స్థాయిలో 2,15,375 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోనే అత్యధికంగా 88.25 పోలింగ్ శాతం అద్దంకిలో నమోదైంది. తర్వాత స్థానంలో 87.32తో పర్చూరు నిలిచింది. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,29,333 ఉండగా 2,00,264 మంది ఓటు వేశారు. వేమూరు నియోజకవర్గంలో 1,97,458 ఓటర్లకు 1,70,666 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 86.43 శాతం నమోదైంది. బాపట్లలో మొత్తం ఓటర్లు 1,90,925 మంది ఉండగా ఇందులో 1,58,500 మంది ఓటేయడంతో 83.02గా ఉంది. చీరాలలో మొత్తం ఓటర్లు 2,02,711 మంది ఓటర్లు ఉండగా 1,67,466 మంది ఓటు వేయగా 82.61 శాతంగా నమోదైంది. రేపల్లెలో 2,27,232 ఓటర్లు ఉండగా 1,87,673 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 82.59 శాతం నమోదైంది.

- బాపట్ల పార్లమెంట్ స్థానంలోని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,14,638 ఉండగా ఇందులో 1,87,721 ఓట్లుపోల్‌కాగా 87.46 శాతం నమోదైంది. బాపట్ల పార్లమెంట్‌స్థానం మొత్తం చూస్తే సరాసరిన 85.48 శాతంగా ఉంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా కలుపుకుంటే ఈ శాతం 86.72గా నమోదైంది.
- బాపట్ల పార్లమెంట్ స్థానం పోస్టల్ బ్యాలెట్ మొత్తానికి వస్తే ఈ సంఖ్య 19,772గా ఉంది. ఇందులో పోలైనవి 18,672గా ఉన్నాయి. 94.43 శాతంగా నమోదైంది.

| నియోజకవర్గం | మొత్తంఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| వేమూరు | 1,97,458 | 1,70,666 | 86.43 |
| రేపల్లె | 2,27,232 | 1,87,673 | 82.59 |
| బాపట్ల | 1,90,925 | 1,58,500 | 83.02 |
| పర్చూరు | 2,29,333 | 2,00,264 | 87.32 |
| అద్దంకి | 2,44,057 | 2,15,375 | 88.25 |
| చీరాల | 2,02,711 | 1,67,466 | 82.61 |
| మొత్తం | 12,91,716 | 10,99,944 | 85.15 |

పోస్టల్ బ్యాలెట్ ఇలా...

| నియోజకవర్గం | మొత్తం | పోలైనవి | శాతం |
|---|---|---|---|
| వేమూరు | 2,076 | 1981 | 95.42 |
| రేపల్లె | 3818 | 3,582 | 93.81 |
| బాపట్ల | 2,899 | 2,719 | 93.79 |
| పర్చూరు | 2,920 | 2,766 | 94.72 |
| అద్దంకి | 2,821 | 2,702 | 95.78 |
| చీరాల | 3,271 | 3,017 | 92.23 |
| మొత్తం | 17,805 | 16,767 | 94.17 |

## స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, మే 15: బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఈవీఎంలను భద్రపరిచిన ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కంట్రోల్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల ఫుటేజిలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ, ఎలక్షన్‌సెల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, రూరల్ ఇన్‌స్పెక్టర్ వై.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.




భద్రతపై సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

### రీపోలింగ్ లేకుండా ఎన్నికలు

ఎన్నికలను రీపోలింగ్‌కు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఓటు వేశారని అందుకే ఓటింగ్‌శాతం పెరిగిందని చెప్పారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలింగ్ రోజున కేంద్రాల బయట మాత్రమే చిన్నచిన్న ఘర్షణలు జరిగాయన్నారు. 30 కేసులు నమోదు చేసి అందులో 241 మందిని నిందితులుగా చేర్చామన్నారు.

అంతిమ యాత్ర
డా॥ బొప్పన పూర్ణచంద్రరావు గారు
ది. 15-05-2024 బుధవారం సాయంత్రం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము..



డా॥ బొప్పన పూర్ణచంద్రరావు గారు
MBBS
జననం: 06-05-1935 మరణం: 15-05-2024
అంతిమయాత్ర :
ది. 16-05-2024 గురువారం ఉ॥10 గం.లకు విజయవాడ, బందరురోడ్డు, పప్పులమిల్లు సెంటర్, మెగా ఎస్టేట్స్, గంగా బ్లాక్‌లోని మా స్వగృహము నుండి బయలుదేరును.
కుటుంబ సభ్యులు
ఫోన్: 94401 63164

# దిక్సూచి DIKSUCHI

సైన్స్ విద్యార్థుల కోసం

# టెన్త్, ఇంటర్ తరవాత What Next

(నిన్నటి పేజీ తరువాయి)

## హోమ్ సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ

ఇంటర్ బైపీసీతో పూర్తిచేసినవారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. న్యూట్రిషనిస్ట్, డైటీషియన్స్, ఫుడ్ టెక్నాలజిస్టులుగా ఉపాధి లభిస్తుంది. సమతుల ఆహారంపై ఈ మధ్య కాలంలో అందరికీ అసక్తి ఏర్పడటంతో ప్రైవేటు రంగంలోనూ ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు పెరుగుతున్నాయి. ముడి ఆహార పదార్థాలను మనుషులు, జంతువులు ఆసక్తిగా, అవసరమైనప్పుడు తినేట్టు చేయడమే ఫుడ్ టెక్నాలజీ కోర్సు. వివిధ పద్ధతులు ఆచరించి, మరికొన్ని కలిపి ఆహార పదార్థాలు రుచికితోడు నిల్వ ఉండేలా చేస్తుంటారు. ప్రస్తుతం దేశంలో మూడు కోట్లమంది నెలలో ఎక్కువ రోజులు ప్యాకేజీ ఫుడ్‌పై ఆధారపడి ఉన్నారు. మరో రెండు కోట్ల మంది త్వరలోనే ఈ జాబితాలో చేరే పరిస్థితిలో ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి. అందుకే దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఐదో స్థానంలో ఉన్నాయి. ఫుడ్ టెక్నాలజీ పరిశ్రమలో ఆర్గానిక్ కెమిస్టులు, బయోకెమిస్టులు, అనలిటికల్ కెమిస్టులు, హోస్ ఎకనమిస్టులు, ఇంజనీర్లు(కెమికల్, మెకానికల్, ఇండస్ట్రియల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్, సివిల్, ప్యాకింగ్), రీసెర్చ్ సైంటిస్టులు, మేనేజర్లు, అకౌంటెంట్‌లు మొదలైన వారికి అవకాశాలు ఉంటాయి. ఎంపిసి, బైపిసితో ఇంటర్ పూర్తిచేసి ఈ రంగంలోకి వెళ్లవచ్చు.



### కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Acharya N.G. Ranga Agricultural University, Bapatla, Andhra Pradesh,
- Prof. Jayasankar Agricultural University, Rajendra Nagar, Hyderabad-500030,
- Central Food Technology Research Institute, Mysore-570020, Karnataka.
- Central Institute of Fisheries Education, Fisheries University Road, Seven Bungalows, Andheri(W), Mumbai - 400061, Maharashtra, Website: www.cife.edu.in
- College of Agricultural Technology, Marathwada Krishi Vidyapeeth, Parbani-431402, Maharashtra.
- CSK Krishi Vishwa Vidyalaya, Palamuru-176060, Himachala Pradesh, Website: www.hillagric.org
- Govind Ballabh Pant University of Agriculture and Technology, Pantnagar-263145, Dist. Udham Singh Nagar, Uttarakhand, Website: www.gbpuat.ac.in
- Guru Nanak Dev University , Department of Food Science & Technology, Amritsar-143005, Punjab, Website: www.gndu.ac.in
- Harcourt Butler Technological Institute, Nawab Ganj, Kanpur-208002, Uttar Pradesh, Website: www.hbti.ac.in
- IIT(Indian Institute of Technology), Kharagpur - 721302, West Bengal.
- Jadhavpur University, Department of Food and Technology and Biochemical Engineering, 188 Raja S.C Malik Road, Kolkata-200032, West Bengal, Website: www.jadavpur.edu
- Mahatma Gandhi University, Priyadarshini Hills PO, Kottayam-686560, Kerala, Website: www.mguniversity.edu
- Manipur University, Canchipur, Imphal, Manipur,Website: www.manipuruniv.ac.in
- M.S.University, Vadodara-390002, Gujarat, Website: www.msuboroda.ac.in
- National Dairy Research Institute, NDRI Deemed University Karnal-132001, Haryana, Website: www.karnal.nic.in
- National Sugar Institute, P.O: NSI Kalyanpur, Kanpur-208017, UttarPradesh.

## క్యాబిన్ క్రూ

క్యాబిన్ క్రూ అంటే విమానంలో పనిచేసే సిబ్బంది. ప్రయాణికులు విమానంలో ఎక్కడానికి ముందు ప్రారంభమై, వారిని సురక్షితంగా చేర్చేంత వరకు కొనసాగుతుంది. సాధారణంగా వారానికి 30 వరకు పనిగంటలు ఉంటాయి. అయితే ఇతర ఉద్యోగుల్లా రోజుకు ఇన్ని గంటలు ఉండే అవకాశం ఉండదు. ఒకే రోజు 20 గంటలు కూడా పనిచేయాల్సి రావచ్చు. అయినా ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనీయకుండా చూసుకోవాలి. క్యాబిన్ క్రూలో చేరడానికి సాధారణంగా డిగ్రీని అర్హతగా పరిగణిస్తారు. వయసు 19-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. కొన్ని ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇంటర్ పాసైనవారికీ ఉద్యోగాలు ఇస్తాయి. అలాంటివారి వయసు 18-21 సంవత్సరాల మధ్యలో ఉండాలి. హోటల్ మేనేజ్‌మెంట్/ టూరిజం డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎయిర్ హోస్టెస్‌లకు ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది. ఫస్ట్‌ఎయిడ్ తదితరాలను నేర్పిస్తారు. ఇక్కడ పని చేయాలనుకునే వారికి హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా వచ్చి ఉండాలి. పెద్ద పెద్ద సంస్థలు ఎయిర్ హోస్టెస్‌లకు మంచి మొత్తంలో జీతాలుగా ఇస్తాయి.

## పారా మెడికల్

సాధారణంగా రోగులు డాక్టర్ల దగ్గరికి వెళ్లిన తరవాత పలు రకాలు టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటినీ డాక్టర్లు నిర్వహించరు. ఈ విషయంలో పారా మెడికల్ సిబ్బంది సహాయపడతారు. పారా మెడికల్ కోర్సుల్లో ఆప్టోమెట్రీ, ల్యాబ్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, రీహేబిలిటేషన్ మొదలైనవన్నీ ఉంటాయి. ఈ కోర్సుల్లోని చాలా విభాగాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు, స్వయం ఉపాధికి కూడా అవకాశం ఉంటుంది.

## ఫోరెన్సిక్ సైన్స్

ఫోరెన్సిక్ అనేది లాటిన్ పదం. ఫోరెన్సిక్ సైన్స్ అనేది నేరాలను శాస్త్రీయంగా నిర్ధారించే శాస్త్రం. ఫిజికల్, మెడికల్, బయోలాజికల్, మెడికల్ తదితర సబ్జెక్టుల నుంచి పుట్టిన శాస్త్రం ఇది. మొదటిసారిగా భారత ప్రభుత్వం 1972లో న్యూఢిల్లీలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్‌సైన్స్(www.nicfs.nic.in)ను ఏర్పాటు చేసింది. ఇది కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థ ఇప్పటి వరకు వేలాది మందికి ఫోరెన్సిక్ సైన్స్‌లో శిక్షణ ఇచ్చింది. వీరిలో ప్రపంచంలోని 200 దేశాలవారు ఉన్నారు. ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు కోల్‌కతా, హైదరాబాద్, చండీగఢ్‌లో ఫోరెన్సిక్ లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. క్రిమినాలజీలో ఎంఏ, ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎమ్మెస్సీ కోర్సును ఎల్ఎన్‌జెపి - ఎన్ఐసిఎఫ్ఎస్ అందిస్తోంది. ఒక్కో దానిలో 20 సీట్లు ఉన్నాయి. ఇక్కడ పీజీ డిప్లొమా ఇన్ డాక్యుమెంటేషన్, ఫోరెన్సిక్ బాలిస్టిక్, ఫోరెన్సిక్ బయాలజీలతో పాటు కొన్ని షార్ట్‌టర్మ్ కోర్సులు కూడా ఉన్నాయి. ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించి దేశంలోని పలు యూనివర్సిటీలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇన్ క్రిమినల్ జస్టిస్ కోర్సు ఉంది. ఏ డిగ్రీ చేసినవారైనా ఈ కోర్సులో చేరొచ్చు. అదేవిధంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (www.gfsu.edu.in) కూడా ఉంది.

### కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Anna University (Chennai 600025) - Post - BE Diploma in Forensic Engineering
- Bundelkhand University (Jhansi 284128)-PG Diploma in Forensic Science
- PG Diploma in Criminology; University of Delhi (Delhi 110007)-Certificate in Forensic Science(3 months)
- Dr. B.R. Ambedkar University(Agra 282004) -MSc(Forensic Science)
- Dr.Hari Singh Gour Vishwavidyalay (Sagar 470003)-MSc. (Criminology), MA (Criminal and Forensic Science).
- Karnataka University (Dharwad-580003)-MA (Criminology and Forensic Science)
- Lucknow University (Lucknow 226007)-PG Diploma in Forensic Anthropology
- University of Madras (Chennai 600005)-MA (Criminology), and MSc. (Forensic Science)
- Osmania University (Hyderabad 500007)-MSc. (Forensic Science Laboratory)
- Panjab University(Chandigarh 160014)-PG Diploma in Forensic Science and Criminal Science.
  1- Punjabi University (Patiala 147002) - MSc(Forensic Science)
- Amity University (Sector 44, Noida-UP) BSc. and MSc. (Forensic Science).

## ఫిజికల్, కెమికల్ అండ్ ఎర్త్ సైంటిస్టులు

ఇంజనీరింగ్ ద్వారా కెమికల్ ఇంజనీరింగ్ చేయవచ్చు. బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసిన వారికి కూడా కెమికల్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ డిప్లొమాలు ఉన్నాయి. జేఎన్‌టీయూ, ఆంధ్రా, ఓయూలలో కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఫిజిక్స్, మేథ్స్‌లో కూడా ఇలాంటి కోర్సులు ఉన్నాయి. డిగ్రీ/పీజీల్లో జాగ్రఫీ సబ్జెక్టులు చదివిన వారు జియాలజిస్టులుగా వెళ్లవచ్చు. ఓషనోగ్రఫీకి సంబంధించిన కోర్సులు ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నాయి. కెమికల్ ఇండస్ట్రీ, ఫిజిక్స్ అండ్ అలైడ్ ఫీల్డ్‌లో ఉపాధి ఉంటుంది. మేథమెటీషియన్స్ అండ్ స్టాటిస్టీషియన్స్, జియాలజిస్టులుగా, జాగ్రఫీ అండ్ జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ స్పెషలిస్టులుగా, మెట్రోలాజిస్టులుగా, ఓషనోగ్రాఫర్లుగా అవకాశాలుంటాయి.

## ఆర్కిటెక్చర్ & కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ

మేథ్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు ఇందులో ఇంజనీరింగ్ చేయవచ్చు. టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా ఆధారంగా కూడా సర్టిఫికెట్ పొందవచ్చు. ఆర్కిటెక్చర్, నేవల్ ఆర్కిటెక్చర్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో ఉద్యోగాలుంటాయి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/cjd3qajలో చదవండి.

## మర్చెంట్ నేవీ

ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు ఎక్కువ మొత్తం నౌకా రవాణా ద్వారానే జరుగుతున్నాయి. అందుకు కారణం మిగిలిన రవాణాలతో పోలిస్తే ఇది చాలా చౌక. అందుకే ప్రపంచ వ్యాప్తంగా షిప్పింగ్ ఇండస్ట్రీకి మంచి ఆదరణ ఉంది. మర్చెంట్ నేవీలోకి వెళ్లినవారికి అనుకూలతలు, ప్రతికూలతలు రెండూ ఉన్నాయి. కొత్త కొత్త ప్రదేశాలకు వెళ్లడం వీరికి అనుకూలత. అయితే నెలల తరబడి సముద్ర ప్రయాణంలోనే జీవితం గడిచిపోతుంది. కుటుంబ జీవితం కూడా దూరమవుతుంది. నేవిగేటింగ్ ఆఫీసర్, రేడియో ఆఫీసర్, మెరైన్ ఇంజనీర్స్ తదితరాల్లో కెరీర్ వెతుక్కోవచ్చు. ఇప్పటివరకు ఇందులో మహిళలకు అవకాశాలు లేవు. అయితే షిప్ డాక్టర్లు, రేడియో ఆఫీసర్లుగా ఇప్పుడిప్పుడు వారు ఇందులోకి ఎంటర్ అవుతున్నారు. కోల్‌కతాలోని మెరైన్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ముంబైలోని చాణక్యలో చేరాలంటే మాత్రం జెఇఇలో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

### ఇవికాకుండా... మర్చెంట్ నేవీలో శిక్షణ ఇచ్చే సంస్థలు

- Indian Maritime University (T.S. Chanakya), Karave Village, Sector 34, Nerul, Navi Mumbai, Maharashtra 400706, Ph: 022 2770 3876.
- Praveenya Institute of Marine Engineering & Maritime Studies (PRIME), D.No.-1-74-15, Plot No.61/3,Sector 3, MVP Colony, Visakhapatnam, Andhra Pradesh 530017,
- AMET UNIVERSITY, Plot No.135, East Coast Road, Kanathur, Chennai, Tamil Nadu 603112, Ph: 044 2747 2904.
- Commander Ali's Academy of Merchant Navy, Commander Ali's Estates, Survey No.469, Donthi, Shivampet Mandal, Medak District, Telangana 502334.
- Dr.B.R.Ambedkar Institute of Technology, Polytechnic Road, Pahargaon,, Junglighat, Port Blair, Andaman and Nicobar Islands 744103, Ph: 03192 259 693.
- Indian Maritime College, Masilamani Street, T.Nagar, Chennai-600 0178. Ph: 044 2433 6953
- NUSI MARITIME ACADEMY, NUSIWA-DO, Sucaldem,Chinchinim, Salcette-Goa-403715, Ph: 0832 277 3859

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

# నవ్య | చిత్రజ్యోతి

## గుడి కోసం ఎన్టీఆర్ విరాళం



చిన్న సాయం చేసి ఆ విషయం ఊరంతా చాటుకుంటున్న రోజులివి. కానీ ఓ మంచి పని కోసం లక్షల రూపాయల విరాళం ఇచ్చి కూడా ఆ విషయం ఎక్కడా ఎవరికీ చెప్పకుండా మౌనంగా వహించి తన ప్రత్యేకత మరోసారి చాటుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. విషయం ఏమిటంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గన్న పేటలో ఉన్న వీరభద్రస్వామి దేవాలయానికి ఎన్టీఆర్ రూ. 12.50 లక్షల విరాళం ఇచ్చారు. ఇది ఎప్పుడు ఇచ్చారో కూడా ఎవరికీ తెలీదు. చిన్న ఊరు, చిన్న గుడి కావడంతో ఈ విషయం బయటకు కూడా రాలేదు. అయితే ఇటీవల ఎవరో ఆ గుడికి వెళ్లి అక్కడున్న శిలా ఫలకం మీద జూనియర్ ఎన్టీఆర్ పేరు చూసి ఆ విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అందరికీ తెలిసింది. ఎన్టీఆర్ మంచి మనసుకి ఫిదా అయిన నెటిజన్లు ఆయనకు అభినందనలు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.

## డబుల్ డోస్... దిమాకీ కిరికిరి



రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. హీరో పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ 'దిమాకీ కిరికిరి' పేరుతో టీజర్ విడుదల చేశారు. ఇందులో రామ్ ఇస్మార్ట్‌నెస్, కావ్యా థాపర్ పరిచయం, సంజయ్‌దత్ పవర్‌ఫుల్ ఎంట్రీ అలరించాయి. అద్భుత శివలింగం, క్లైమాక్స్ ఫైట్ .. భారీ జనసమూహం కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో కూడా స్పిర్చువల్ టచ్ ఉంటుందని హింట్ ఇచ్చారు దర్శకుడు పూరి. హైదరాబాద్ యాసలో రామ్ చెప్పే డైలాగులు, మాస్ యాక్షన్ ప్యాక్డ్ అవతార్ అలరించాయి. డబుల్ ఎనర్జీ, డబుల్ ఫన్‌తో ఈ సినిమా ఉంటుందని టీజర్ చూడగానే అర్థమవుతుంది.

తెలుగు, తమిళ, కన్నడ, మలయాల, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సన్నాహాలు చేస్తున్నారు.



## వినోదానికి తెర

- నెలాఖరు దాకా సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత

పరీక్షల సీజన్, ఇండియన్ ప్రీమియర్ లీగ్, సార్వత్రిక ఎన్నికలు.. ఇలా అన్నీ ఒకేసారి రావడంతో థియేటర్లకు వెళ్లే జనమే కరువయ్యారు. మినిమం ఆక్యుపెన్సీ కూడా లేకపోవడంతో నష్టాలను తట్టుకోలేక కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లు దాదాపు రెండు వారాల పాటు మూతపడనున్నాయి. పెద్ద సినిమాలేవీ ఇప్పట్లో లేకపోవడం, చిన్న సినిమాలను చూసేందుకు ప్రేక్షకుడు ఆసక్తి చూపకపోవడం వల్ల రోజురోజుకీ థియేటర్లలో ఆక్యుపెన్సీ తగ్గిపోతోంది. ఈ కారణంగానే ఈనెల 17 నుంచి నెలాఖరు వరకూ థియేటర్లను స్వచ్ఛందంగా మూసేయ్యాలని కొంతమంది థియేటర్ యజమానులు నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌కు, ఈ నిర్ణయానికీ ఎలాంటి సంబంధం లేదని, ఇప్పట్లో పెద్ద సినిమాల విడుదల లేకపోవడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఓ ఎగ్జిబిటర్ వెల్లడించారు. రోజువారీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో నష్టాలను తగ్గించు కోవడానికి థియేటర్ రన్ తాత్కాలికంగా ఆపడం తప్ప వేరే మార్గం లేదని ఆయన వాపోయారు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరమే అయినా తప్పడం లేదని మరికొంత మంది థియేటర్ యజమానులు చెప్పారు.

### నష్టాలు వస్తున్నా మొండిగా నడుపుతున్నాం

అయితే తాము థియేటర్లను మూత వేయడం లేదని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. నాలుగు షోలకు బదులుగా ఐదు షోలు వేయబోతున్నామని చెప్పారు. కొన్ని థియేటర్ల యజమానులు మాత్రమే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చన్నారు. జంట నగరాల్లో, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఇలా థియేటర్లు మూత వేస్తున్న వారు ఎవరూ లేరన్నారు. నగర శివార్లు, తాలూకాలలో కొన్ని చోట్ల ఇలా చేస్తుండవచ్చన్నారు. సినిమాలు లేవని థియేటర్ మూత వేస్తే అది థియేటర్ రన్‌పై నెగిటివ్ ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు, అందుకే మూతేయడం ఇష్టం లేక, కష్టమైనా నడుపుతున్నాం అని సంధ్య థియేటర్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. వీరి బాటలోనే మరి కొంతమంది థియేటర్ల యజమానులు కూడా తమ నిర్ణయాన్ని మార్చుకొని ప్రదర్శనలను కొనసాగించనున్నట్లు తెలిపారు. పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వకపోయినా ప్రస్తుతానికి చిన్న సినిమాలనే ప్రదర్శిస్తామని చెబుతున్నారు.

### కనీసం పదిమంది ఉండడం లేదు

కనీసం పదిమంది అయినా వస్తేనే షో వేస్తున్నాం. ఇటీవలే విడుదలైన ఒక సినిమాకు మూడు షోలు అలాగే వేశాం. నాలుగో షోకు అంతమంది జనం లేకపోవడంతో రద్దు చేశాం. మల్టీప్లెక్స్‌ల్లో కూడా ఇదే జరుగుతోంది. థియేటర్ దగ్గరకొచ్చాక షో బంద్ అనడంతో కొన్నిసార్లు ప్రేక్షకులతో గొడవలు అవుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్‌లతో కలిపి 1900 స్క్రీన్లు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి. మిడ్‌రేంజ్ సినిమాలకు కూడా నిర్మాతలు షేర్ గ్యారంటీలు, అడ్వాన్స్‌లు అడుగుతున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య మేం రిస్క్ చేయాలని అనుకోవడం లేదు. నిర్మాతలు ముందుకు వచ్చి తగిన సహకారం అందిస్తే సినిమాలు ప్రదర్శిస్తాం.

-విజయేందర్ రెడ్డి,
తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్.




## భార్యాభర్తల ఈగోల గోల



రాహుల్ విజయ్, శివానీ జంటగా నటించిన 'విద్య వాసుల అహం' వెబ్ సిరీస్ ఈ నెల 17న ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. మణికాంత్ గిల్లి దర్శకత్వంలో మహేశ్ దత్తా, లక్ష్మి నవ్య నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ - కొత్తగా పెళ్లయిన విద్య, వాసు అహంకారాన్ని వీడి తమ కాపురాన్ని ఎలా చక్కదిద్దుకున్నారనే ఇతివృత్తంతో సిరీస్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఇది కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనీ, ఇందులోని నాలుగు పాటలను నాలుగు రకాలుగా సంగీత దర్శకుడు కల్యాణీ మాలిక్ కంపోజ్ చేశారని తెలిపారు. హీరోయిన్ శివానీని కూడా ఆయనే రికమెండ్ చేశారని మణికాంత్ గిల్లి చెప్పారు.

హీరో రాహుల్ మాట్లాడుతూ 'ఇదొక క్యూట్ ఈగోస్ ఫన్ ఫిల్మ్. హాయిగా ఫ్యామిలీతో కలసి చూస్తూ ఎంజాయ్ చెయ్యవచ్చు' అన్నారు.

'ఈ టీమ్‌తో నాకు రెండేళ్ల నుంచి అనుబంధం ఉంది. దర్శకుడు మణికాంత్ కథ చెప్పగానే హీరో ఎవరని అడిగాను. రాహుల్ విజయ్ అని చెప్పగానే హ్యాపీగా ఫీల్ అయ్యాను. ఈ ప్రాజెక్ట్ ఒప్పుకొన్న వారం రోజులకి 'కోట బొమ్మాళి' చిత్రం ఓకే అయింది. అలా రెండేళ్లుగా రాహుల్‌తోనే వర్క్ చేస్తున్నాను. ఏ మాత్రం ఈగో లేని వ్యక్తి' అని శివానీ చెప్పారు.

## ట్రెండ్ సెట్ చేస్తుంది



'మంత్ర, మంగళ' లాంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో దర్శకుడిగా మంచి విజయాలను అందుకున్నారు ఓషో తులసిరామ్. ఈసారి ఆయన సైకో థ్రిల్లర్ చిత్రం 'దక్షిణ'తో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కల్ట్ కాన్సెప్ట్ మూవీ బేనర్‌పై అశోక్ షిండే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కబాలి' ఫేమ్ సాయిధన్సిక ఇందులో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా యూనిట్ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో నన్ను భయపెట్టిన ట్రైలర్ ఇదే. 'దక్షిణ' చిత్రంతో తులసిరామ్ గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ను ఇవ్వబోతున్నారు' అని ప్రశంసించారు. నిర్మాత మాట్లాడుతూ "దక్షిణ' సినిమా ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్‌ను ఇస్తుంది. తర్వాతేం జరుగుతుందో అనే ఉత్కంఠను ప్రేక్షకులు అనుభవిస్తారు, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/6BEI2IA
లో చదవండి.

# గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్ర॥ 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614



సమావేశంలో మాట్లాడుతున్న నసీర్, పక్కన డేగల, ఎమ్మెల్యే శ్రీదేవి

## గుంటూరు తూర్పులో కూటమి విజయం తథ్యం

● మొహమ్మద్ నసీర్

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కూటమి విజయం తథ్యమని కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. టీడీపీ తూర్పు కార్యాలయంలో బుధవారం టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, టీడీపీ నేత షౌకత్‌లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎండను లెక్క చేయకుండా మహిళలు, వృద్ధులు ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయడం గొప్ప విషయమన్నారు. గడిచిన రెండు నెలలుగా తనకు తోడుగా వుండి గెలుపునకు కృషి చేసిన మూడు పార్టీల నేతలకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాబోతోందని చెప్పారు. కూటమి ప్రభంజనాన్ని ఎవరూ అపలేరన్నారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధిని అటకెక్కించి, రాక్షస పాలనతో ప్రజలను పీడించిన వైసీపీ ప్రభుత్వంపై విసిగిపోయి బుద్ధి చెప్పేందుకు ప్రజలు ముందుకొచ్చి కూటమివైపు నిలిచారన్నారు. వైసీపీ నేతలు ఓటమి భయంతో రాష్ట్రంలో పలుచోట్ల టీడీపీ కార్యకర్తలు, ప్రజలపై దాడులు చేస్తున్నారన్నారు. తూర్పు నియోజకవర్గంలో ఆటో నగర్‌లో షాపులను తగలబెట్టారని, దొంగ ఓట్లను అడ్డగించినందుకు బూత్ ఏజెంట్ చెయ్యి విరగ్గొట్టారని, నసీర్ అనే వృద్ధుడిపై ముస్తఫా కుమారుడు దాడికి పాల్పడి కత్తితో బెదిరించారని తెలిపారు. వైసీపీ ఎన్ని చేసినా కూటమిని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో దయారత్నం, సత్యం, కాలం, ఐల శ్రీనివాస్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సాయం చేసిన భరత్‌రెడ్డి

గుంటూరు (మెడికల్) మే 15 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని చలమయ్య హైస్కూల్‌లో బూత్ నెంబరు 223లో వైసీపీ మూకల దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మట్టా ఉమామహేశ్వరరావును బుధవారం సిమ్స్ విద్యా సంస్థల డైరెక్టర్ భీమనాదం భరత్‌రెడ్డి కలసి పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. వారు కోరుకుంటే వారి పిల్లల చదువుకు కూడా సాయం చేస్తానని కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు సాధినేని శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు నెలకుర్తి వెంకటరావు, కంజుల వేమారెడ్డి, జాని, మారెడ్డి నర్సిరెడ్డి పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న భీమనాదం భరత్‌రెడ్డి

## రాష్ట్రాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనుడు సర్ ఆర్థర్ కాటన్

గుంటూరు, మే 15 : ఆంధ్రప్రదేశ్ ధాన్యాగారం కావటానికి మూల పురుషునిగా, జీవన ప్రదాతగా ఎప్పటికీ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో సజీవంగా గుడికట్టుకున్న మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం గోదావరి డెల్టా పితా మహుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ మహాశయుని పేరు చెబితే చాలు గోదావరి జలాలు నిలువెత్తు పులకించిపోతాయన్నారు. గోదావరి ప్రాంత వాసులకు పట్టెడన్నం పెట్టిన మహాపురుషుడు కాటన్ దొర అని కీర్తించారు. కాటన్‌దొర చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, అవధానుల హరి, సింగరయ్య, మల్లేశ్వరరావు, అనీల్ తదితరులున్నారు.




ఆర్థర్ కాటన్ దొర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ఫిరంగిపురం, మే 15 : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో బుధవారం ఇద్దరు యువకులు, ఒక విద్యార్థి దుర్మరణం పాలయ్యారు. ఫిరంగిపురం మండలంలోని గొల్లపాలెం, రేపూడి కాలనీకి చెందిన గోసాల రాజేంద్ర(35), మద్ది దుర్గా ప్రసాదు(37)లు బుధవారం ఉదయం 10:30 గంటలకు స్కూటీపై రేపూడికాలనీ నుంచి గుంటూరు వైపు వెళుతున్నారు. అదే సమయంలో గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై నున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. గోసాల రాజేంద్రకు భార్య సౌభాగ్యం, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమా రుడు ఉన్నారు. మరో మృతుడు దుర్గాప్రసాదుకు భార్య అనూష, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించామని పోలీసులు తెలిపారు.

## కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, మే 15: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజి 6వ ఖానా వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని బుధవారం పోలీసులు కనుగొన్నారు. బ్యారేజీ పై నుంచి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఒంటిపై తెలుపు రంగు చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతుడికి సుమారు 40సంవత్సరాల లోపు వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. తాడేపల్లి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాకుమానులో వీఆర్ఏ మృతి

కాకుమాను, మే 15: కాకుమానుకు చెందిన వీఆర్ఏ మెరిగల వర్ధీలు బుధవారం వేకువజామున మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న తహసీల్దార్ పార్వతి ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ సాయం కింద 15 వేల రూపాయల నగదు అందజేశారు. వర్ధీలుకు నివాళి అర్పించిన వారిలో వీఆర్వో సూరిబాబు, సరోజని, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు రాజేష్, విజయరాజు తదితరులున్నారు.

## దళిత యువకుడిది హత్యా..? సహజ మరణమా..?!

● పోస్టు మార్టం రిపోర్టు వస్తేగాని చెప్పలేమంటున్న పోలీసులు

తుళ్లూరు, మే 15: మండలపరిధిలోని వడ్డమాను గ్రామంలో వైసీపీ నేత చుండు నర్సిరెడ్డి దగ్గర పదేళ్లుగా పనిచేస్తున్న దళిత యువకుడు మురికిపూడి బుల్లిబాబుది(33) సహజ మరణమా..? హత్యా..?! అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం పోలింగ్ రోజు పొలంలో చెట్టుకింది బుల్లిబాబు మృతదేహం పడి ఉంది. ఒంటిపై రక్తపు గాయాలున్నాయని, హత్యచేసి పడేశారని తల్లి మరియమ్మ తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ అనుమానాస్పద మృతిపై పలు రకాలుగా గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. పశువుల కొట్టంలో కొట్టి చంపేసి ఆ తరువాత పొలంలో చెట్టుకింది పడేశారనే ఒక వాదన వినబడుతుంది. అధికంగా మద్యం తాగి పశువులు తోలుకొని పొలం వెళ్లి మంచినీరు అందక బుల్లి బాబు మృతి చెందాడని కొందరు మాట్లాడుకుంటున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని తుళ్లూరు సీఐ సుభానీ బుధవారం విలేకరులకు తెలిపారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో బుల్లిబాబు మృతదేహానికి పోస్టుమార్టం మంగళవారం జరిగింది. ఆ రిపోర్టు వస్తేగాని హత్యా, సహజ మరణమా.. అనేది చెప్పలేమని సీఐ తెలిపాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

# ఎన్నికల మాటున వైసీపీ హింసాకాండ

● కోవెలమూడి రవీంద్ర, గల్లా మాధవి

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికలను అడ్డం పెట్టుకొని వైసీపీ మూకలు హింసాకాండకు పాల్పడుతున్నాయని, మాచర్ల, చంద్రగిరి, తాడిపత్రిలో పేట్రేగిపోయారని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, పశ్చిమ కూటమి అభ్యర్థి గల్లా మాధవి ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవీంద్ర (నాని) మాట్లాడుతూ ఓటమి భయంతో వైసీపీ గూండాలు దాడులకు తెగబడుతున్నారని అన్నారు. పోలింగ్ రోజున గొడవలు జరుగుతాయి కానీ పోలింగ్ జరిగి 48 గంటలు దాటుతున్నా కూడా దాడులు ఆగటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధులు, మహిళలు పెద్దయెత్తున తరలివచ్చి జగన్ రెడ్డికి వ్యతిరేకంగా ఓటేశారన్నారు. అధికార పార్టీ మూకలు ఎన్ని అసౌకర్యాలు సృష్టించినా ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఓటు హక్కు వినియోగించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. జూన్ 4న ప్రజా ప్రభుత్వం రాబోతుందని, గల్లా మాధవి, పెమ్మసాని చంద్రశేఖర్‌లు గెలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పోలింగ్‌కు సహకరించిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గుంటూరు పశ్చిమ ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి మాట్లాడుతూ పోలింగ్ రోజు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కూటమికి ఓటేశారన్నారు. దానిని తట్టుకోలేని వైసీపీ నేతలు దాడులకు పాల్పడ్డారని, అయినా ప్రజలు వైసీపీ నాయకుల భయభ్రాంతులకు లొంగకుండా ఓటేశారన్నారు. జూన్ 4 నుంచి స్వర్ణయుగంలోకి అడుగుపెడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో అద్భుతమైన పాలన చూడబోతున్నామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర మాట్లాడుతూ పోలింగ్ రోజు ప్రజా సునామీని చూశామన్నారు. ప్రజాసమస్యలు తీర్చే సత్తా కూటమికి మాత్రమే ఉందన్నారు. కొత్త ఓటర్లు కూటమికి అండగా నిలిచారన్నారు. ఓటు అనే ఆయుధంతో వైసీపీని తరిమికొట్టారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీని అభివృద్ధిలో ముందు ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో కసుకుర్తి హనుమంతరావు, దామచర్ల శ్రీనివాసరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గల్లా మాధవి, నాని

## హెల్త్ కార్డులు ఉండి ఏం ప్రయోజనం

● ఈదర వీరయ్య

గుంటూరు, మే 15 : రాష్ట్రంలోని పింఛన్‌దారులకు ఆరోగ్యకార్డులు జారీ చేసినా ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్య సేవలందించేందుకు నిరాకరిస్తున్నాయని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఆరోపించారు. ఆరోగ్యశ్రీ ప్యాకేజీ సరిపోదని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం చెబుతుంది. టారిఫ్ 60 శాతం పెంచాలని డిమాండ్ చేస్తుందన్నారు. ఆర్మీ సిబ్బందికి ఆర్మీ హాస్పటల్, నేవీ వారికి నేవీ హాస్పటల్, రైల్వే వారికి రైల్వే హాస్పటల్, కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి, ఆర్టీసీ వారికి ఆర్టీసీ హాస్పటల్ ప్రత్యేకంగా ఉండగా ఉద్యోగులు, పెన్షన్‌దారులకు ప్రత్యేక హాస్పటల్‌లను ఎందుకు ఏర్పాటు చేయరని ఆయన ప్రశ్నించారు. ప్రీమియం వసూలు చేస్తూ కూడా వైద్య సేవలందించకపోవటం దారుణమన్నారు. అవసరమైతే ఆరోగ్య కార్డుల ప్రీమియం రూ.225 నుంచి రూ.400లకు పెంచినా సమ్మతమేనని అత్యవసర శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సిన వారు హెల్త్ కార్డు తీసుకెళ్ళినా వారి కార్డు వివరాలు ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆమోదించే వరకు ఎటువంటి వైద్య సేవలు అందే అవకాశం లేదని, ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు హెల్త్‌కార్డుపై అన్ని వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని లేదా ప్రత్యేకమైన హాస్పటల్స్‌ను ఉద్యోగస్తులకు, పెన్షన్‌దారులకు ఏర్పాటు చేయాలని వీరయ్య డిమాండ్ చేశారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మే 15 : విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు చంద్రమౌళీనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డి 8 సెక్షన్ ఏఈ చిట్టిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## రాక్షస మూక రక్తపాతాన్ని అరికట్టాలి : పాతర్ల రమేష్

తాడేపల్లి, మే 15: ఓటమి భయంతో రాష్ట్రంలో విధ్వంసం, వినాశకానికి జగన్‌రెడ్డి తెరలేపారు. రక్తపాతానికి తెగబడ్డారు.. టీడీపీ అభ్యర్థులు, కార్యకర్తలపై మారణాయుధాలతో దాడిచేశారు... ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు కుట్రపన్నారు... కానీ ప్రజలు రాక్షస మూకలను గద్దెదించాలని నిర్ణయించుకున్నారు. అందుకే కూటమికి ఓట్లు వేసి భారీగా పోలింగ్ శాతాన్ని పెంచారు. దీన్ని జీర్ణించుకోలేక వైసీపీ మూకలు దాడులకు తెగబడ్డాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ బుధవారం తాడేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. చంద్రగిరిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిని చంపాలని ప్రయత్నం చేశారు. తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాచర్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వైసీపీ కార్యకర్తలను ఉసిగొల్పి దాడులకు ప్రోత్సహించారన్నారు. కానీ వారిపై కూడా చర్యలు శూన్యమని రమేష్ అన్నారు. ఓట మి భయంతోనే వీరంతా దాడులకు తెగబడుతున్నారని చెప్పారు.

## అరాచక పాలనకు బుద్ధి చెప్పిన ప్రజలు : జొన్నాదుల

మంగళగిరి, మే 15: అయిదేళ్లపాటు అరాచక పాలన సాగించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రజా చైతన్యానికి నిదర్శనమని టీడీపీ నేత జొన్నాదుల బాలకృష్ణ అన్నారు. లోకేశ్ విజయానికి కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్

గుంటూరు (మెడికల్) మే 15: దేశంలో వచ్చే ఏడాది చివరి నాటికి క్షయను పూర్తిగా నిర్మూలించేందుకు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం గురువారం నుంచి జిల్లాలలో ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గురువారం సచివాలయాల్లోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ద్వారా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమ పరిశీలకులు, ఆర్‌బీఎస్‌కే స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ 18 ఏళ్ల పైబడిన వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐదేళ్ల కిందట టీబీ విన్ పోర్టల్‌లో నమోదైన క్షయ రోగుల కుటుంబ సభ్యులు, 60 ఏళ్ల పైబడిన వారు, మధుమేహ రోగులు, ధూమపానం చేసే వారు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువగా ఉన్న వారికి బీసీజీ వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు మాట్లాడుతూ అర్హులైన అందరికీ ఈ టీకా ఇస్తామన్నారు. ఆరోగ్య సిబ్బంది కూడా చిత్తశుద్ధితో పని చేసి వ్యాక్సినేషన్ విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న విజయలక్ష్మి, ప్రశాంత్ తదితరులు

## డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

తెనాలి, మారీసుపేట మే 15: పట్టణ ప్రజలు డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మలేరియా యూనిట్, సబ్ యూనిట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 16వ తేదీన ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణ, గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

## తల్లిపై కోపంతో ఇంటికి నిప్పు పెట్టిన కుమార్తె

తెనాలి, మారీసుపేట మే 15 : కన్నతల్లిపై క్షణికావేశంతో అమ్మ నివసించే ఇంటికే నిప్పు పెట్టిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బుధవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెంచుపేటలో నివసించే కొండమూడి రోసమ్మకు అమరావతి ప్లాట్స్‌లో నివసించే మున్నంగి సుజాత అనే కుమార్తె కలదు. అమెకు ఇద్దరు కుమార్తెలు, వారివురూ తన తల్లి రోసమ్మ వద్ద నివసిస్తున్నారు. వారిని ఎన్నిసార్లు తనవద్దకు పంపమని కోరిన తన తల్లి పంపటంలేదని, కుమార్తెలు కూడా తన వద్దకు రావడంలేని కోపంతో తల్లి నివసించే పూరింటికి మంగళవారం రాత్రి నిప్పు పెట్టిందన్నారు. చుటుపక్కల వారు గమనించి మంటలను ఆర్పివేసినట్లు తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. బాధితురాలు రోసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

# ధైర్యంగా ఉండండి.. పార్టీ అండగా ఉంటుంది

● ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, మే 15: అధైర్యపడవద్దు.. ధైర్యంగా ఉండండి.. పార్టీ అండగా ఉంటుందని వైసీపీ మూకల దాడిలో గాయపడిన బాధితులకు తెనాలి శ్రావణ్‌కుమార్ భరోసా కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో నిడుముక్కల గ్రామంలో టీడీపీ నాయకులపై జరిగిన దాడిలో గాయపడిన బాధితులను ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, టీడీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. నిడుముక్కల పంచాయతీ వార్డు మెంబరు గజ్జర్ల పూడి స్వరూప ఇంటిపైకి రాళ్లు రువ్వి, దాడి చేసి విలువైన వస్తువులను ధ్వంసం చేయటమే కాకుండా ఆమెను కొట్టారు. అంతేకాకుండా పోలింగ్ సమయంలో నెప్పల్లి కిషోర్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. బుధవారం బాధితులను పరామర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ శ్రేణులపై దాడులు చేయటం హేయమని అన్నారు. ఇంటిలోకి చొరబడి వస్తువులను నాశనం చేయటం, చిన్నపిల్లలని చూడకుండా కొట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. బాధితులకు బాసటగా ఉంటామని చెప్పారు. బాధితులను పరామర్శించిన వారిలో సీనియర్ నాయకులు కంచర్ల శివరామయ్య, ఎద్దూరి హనుమంత రావు, మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, ఫిరంగిపురం మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు, గడ్డిపాటి సాంబశివరావు, చిగురుపాటి అనూప్, ఎంపీటీసీ తాటి తులసీరామ్ తదితరులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్

# లోకేశ్ ఘన విజయం తథ్యం

● కులమతాలకు అతీతంగా లోకేశ్‌కు ఓట్లేసిన ప్రజలు
● ప్రజలందరి ఆశీస్సులతో త్వరలోనే కూటమి ప్రభుత్వం
● లోకేశ్ గెలుపు కోసం కృషి చేసిన శ్రేణులకు కృతజ్ఞతలు
● టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త అబద్దయ్య

మంగళగిరి సిటీ, మే 15: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన నారా లోకేశ్ రికార్డు విజయం సాధించి సరికొత్త చరిత్ర సృష్టించ బోతున్నారని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య స్పష్టం చేశారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి లోకేశ్‌తోనే సాధ్యమని నమ్మిన ప్రజలు కులమత, రాజకీయాలకు అతీతంగా ఓట్లు వేశారని చెప్పారు. లోకేశ్ గెలుపు కోసం కృషి చేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా అహర్నిశలు శ్రమించారని తెలిపారు. ప్రజలు ఉదయాన్నే స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. గతంలో ఎప్పుడూ ఓటు వేయని వారు, కొత్తగా ఓటు వచ్చిన వారు కూడా చంద్రబాబును సీఎం చేయాలన్న తపనతో ఓటు వేశారన్నారు. మంగళ గిరిలో తొలిసారి 85.74 శాతం పోలింగ్ నమోదు కావడం సంతోషకర పరిణామమన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో త్వరలోనే కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని తెలిపారు. నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనను అంతం చేసేందుకు ప్రజలంతా పోలింగ్ కేంద్రాలకు ప్రభంజనంలా తరలివచ్చి ఓటు వేశారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు మాట్లాడుతూ లోకేశ్ సారథ్యంలో మంగళగిరి నియోజకవర్గం మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి మేనిఫెస్టోలోని హామీలను రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అందించేందుకు లోకేశ్ కృషి చేస్తారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, జనసేన ఎంటీఎంసీ కార్యదర్శి తిరుమల శెట్టి మురళీకృష్ణ, ఐటీడీపీ నేత సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నందం అబద్దయ్య, పాల్గొన్న నేతలు

## వైభవంగా వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), మే 15 : స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో యువ కళావాహిని నిర్వహణలో వైకే నాగేశ్వరరావు 73వ జయంతి సందర్భంగా పలు రంగాలలో నిష్ణాతులైన కళాకారులకు వైకే నాగేశ్వరరావు స్మారక పురస్కారాల ప్రదాన సభ వేడుకగా జరిగింది. సంస్థ అధ్యక్షుడు కళావాచస్పతి లంక లక్ష్మీనారాయణ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా మిర్చియార్డు మాజీ చైర్మెన్ మన్నవ సుబ్బారావు, విశిష్ట అతిధిగా సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ గుంటూరు పి.లీలావతి, గౌరవ అతిధిగా బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ఆత్మీయ అతిధులుగా ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు కావూరి సత్యనారాయణ, మేకల మోహనరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని పురస్కార గ్రహీతలుగా ఎంపికైన హాస్యరస సార్వభౌమ డాక్టర్ శంకర నారాయణ, లఘుచిత్ర దర్శకుడు గుమ్మడి ప్రేమ్‌చంద్, ప్రముఖ రంగస్థల నటి లహరి, ప్రముఖ రంగస్థల, పౌరాణిక నటుడు ముప్వా పెద బాబురెడ్డిలకు పురస్కార ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. సభానంతరం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సింహ ప్రసాదు రచనతో వెంకట్ గోవాడ దర్శకత్వం వహించిన గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారిచే 'మూల్యం' నాటిక ప్రదర్శన సందేశాత్మకంగా సాగింది. సంస్థ కార్యదర్శి జి మల్లికార్జునరావు తదితర కార్యవర్గం అతిధులను కళాకారులను సత్కరించి కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

## ఓటమి భయంతోనే వైసీపీ మూకల దాడులు

● టీడీపీ నేత సతీష్‌శర్మ



టీడీపీ కార్యకర్త సుబ్బారావును పరామర్శిస్తున్న సతీష్‌శర్మ

గుంటూరు, మే 15: ఓటమి భయంతోనే పల్నాడులో వైసీపీ మూకలు రెచ్చి పోయాయని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడీ పీ నేత కోనూరు సతీష్‌శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ రోజున విను కొండ నియోజకవర్గం చెరుకుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన అల్లర్లలో జెడ్డా సుబ్బారావు అనే టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు చేసిన దాడిలో ఆ యన గాయపడ్డారు. గుంటూరు బస్టాండ్ ఎదురు ఉన్న ఓ ప్రైవేటు హాస్పటల్ లో చికిత్స పొందుతోన్న సుబ్బారావును బుధవారం టీడీపీ నాయకులు సతీష్ శర్మ, పాటిబండ్ల విజయ్ పరామర్శించారు. ఓటమి భయం పట్టుకొనే వైసీపీ నేత లు దాడులకు తెగబడ్డారని, వారికి ప్రజలు ఓటుతోనే గుణపాఠం చెప్పారన్నారు.

## టీడీపీ కార్యకర్తలకు పరామర్శ, ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు గంటా పెద్దబ్బాయ్ తదితరులు

గుంటూరు, మే 15 : నగరంలోని 23వ డివిజన్‌లోని కన్నావారితోట, వడ్డెరగూడెంలలో అనారోగ్యంతో బాధపడుతోన్న టీడీపీ కార్యకర్తలను డివిజన్ టీడీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ గంటా పెద్దబ్బాయ్ బుధవారం వారి ఇళ్లకు వెళ్ళి పరామర్శించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న ఆయన టీడీపీ పశ్చిమ అభ్యర్థి గళ్ళా మాధవి అందజేసిన ఆర్థిక సాయాన్ని పెద్దబ్బాయ్ బాధితులకు అందజేశారు. ఎన్నికలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. కూటమి అధికారంలోకి రావటం ఖాయమని, కార్యకర్తలకు మంచిరోజులొస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాం వర్ధనరావు, గంట మౌనిక తదితరులున్నారు.

## 18న జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు

మంగళగిరి సిటీ, మే 15: మంగళగిరిలోని మాస్టర్ జిమ్ సెంటర్లో ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ మాస్టర్స్ ఎక్విప్డ్ బెంచి ప్రెస్- 2024 ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసో సియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలియజేశారు. ఉదయం 8 గంటలకు శరీర బరువు తీసుకున్న అనంతరం పది గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ప్రాక్టీసు కిట్లతో హాజరుకావాలని కోరారు. జిల్లా జట్లను ఎంపిక చేసి ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు మంగళగిరిలో జరిగే రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు 9700844497, 9346307979లలో సంప్రదించాలని సూచించారు.

# నిడుముక్కలలో పోలీస్ పికెటింగ్



నిడుముక్కల గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్

తాడికొండ, మే 15: నిడుముక్కల గ్రామంలో ఎన్నికల సందర్భంగా టీడీపీ, వైసీపీల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి టీడీపీ, వైసీపీ శ్రేణులు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. వైసీపీకి చెందిన మహిళలు సైతం కర్రలు, రాళ్లు పట్టుకొని దాడులకు పాల్పడ్డారు. తమను కులంపేరుతో తిట్టారని వైసీపీ శ్రేణులు ఆరోపించారు. పోలింగ్ సమయంలో టీడీపీ నాయకుడిపై వైసీపీ మూకలు దాడులు చేయటమే కాకుండా ఓ నాయకుడు కుల రాజకీయం చేస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను సముదాయించి పంపించివేశారు. ఏదైన వివాదం జరగుతుందనే ముందస్తు నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

## మానవత్వాన్ని చాటుకున్న యువకులు

● అనాథ మహిళను ఆశ్రమానికి తరలించిన జాగృతభారత్

దుగ్గిరాల, మే 15: అనాథలా పడియున్న గుర్తుతెలియని మహిళను ఆశ్రమానికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు, మతిస్థిమితం లేకుండా, పది రోజులుగా, దుగ్గిరాల బస్‌షెల్టర్‌లో ఓమూలన పడి ఉంది. తిండి, నీరు అందించేవారు లేకపోగా, దోమలు, చీమలు కుట్టడంతో శరీరమంతా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు పసుపు లేటి గణేష్ జాగృత భారత్ ట్రస్ట్‌కు సమాచారం అందించారు. ట్రస్ట్‌కు చెందిన అడపా వెంకట్రావు, ఆరమండ సుధీర్, ఎద్దు సిద్ధులు ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విజయవాడలో ఓ ఆశ్రమానికి తరలించారు. కోవిడ్ సమయంలోనూ ఎంతో మందికి సేవలందించి మానవత్వాన్ని చాటుకున్న జాగృతభారత్ ట్రస్ట్‌ను పలువురు గ్రామస్థులు అభినందించారు.

# బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



వైసీపీశ్రేణులు తగలపెట్టిన ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీశ్రేణులతో కలిసి మాట్లాడుతున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

## వైసీపీ మూకల దాడులు దుర్మార్గం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మే 15 : బాపట్ల మండలం పడమర పిన్నిబోయనవారిపాలెం గ్రామంలో వైసీపీ అల్లరిమూకలు చేసిన దాడులు దుర్మార్గమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. గ్రామంలో మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ విగ్రహాన్ని తగలపెట్టటంపై తీవ్రంగా స్పందించిన ఆయన పార్టీశ్రేణులతో కలిసి ఆ ప్రాంతాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విలేకర్లతో మాట్లాడుతూ విద్యుత్ సరఫరా ఆపి మరీ అల్లరిమూకలు పెట్రోల్ పోసి విగ్రహం తగలపెట్టటం సరికాదన్నారు. ఎన్నడూ లేనివిధంగా గ్రామంలో 92 శాతం ఓట్లు రికార్డు స్థాయిలో నమోదు కావటాన్ని తట్టుకోలేక వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్తలపై భౌతికదాడులకు దిగటంతోపాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని తగలపెట్టటం వైసీపీ అరాచకపాలనకు పరాకాష్ట అన్నారు. బాపట్లలో తెలుగుదేశం పార్టీ గెలుస్తుందనే అక్కసుతో ఇలాంటి దుశ్చర్యలకు వైసీపీ గుండాలు పాల్పడ్డారంటూ మండిపడ్డారు. నర్రా ఏడుకొండలు అనే టీడీపీ కార్యకర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విధంగా దాడులకు పాల్పడుతూ అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. గొడవలకు కారణమైన జడ్పీటీసీ భర్త పిన్నిబోయిన సుందర్‌సింగ్‌పై రౌడీషీటు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలను కేవలం ఒక మంచి నాయకుడిని, మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజాస్వామ్యబద్ధమైన ప్రక్రియగానే చూడాలి తప్ప ప్రశాంతమైన పల్లెలో అశాంతిని నెలకొల్పకూడదని వైసీపీ శ్రేణులకు నరేంద్రవర్మ హితవు పలికారు. జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త నామన వెంకట శివన్నారాయణ, వెంకట్రావు, కర్లపాలెం జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, బడుగు నాగేశ్వరరావు, నక్కల వీర రాఘవయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు పురస్కారాలు

కర్లపాలెం, మే 15 : కర్లపాలెం మండలంలో 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన నాలుగు పాఠశాలల విద్యార్థులకు రామకృష్ణసేవాసమితి వ్యవస్థాపకుడు కాటూరి వెంకటేశ్వరరావు బుధవారం రామకృష్ణసేవాసమితిలో నగదు పురస్కారాలను అందజేశారు. హైవెండ్ హైస్కూల్‌కు చెందిన షేక్ జాస్మిన్, కర్లపాలెం పబ్లిక్ స్కూల్‌కు చెందిన డొగుపర్తి తులసీఅక్షయ, త్రివేణి అమృత, భార్గవి స్కూల్‌కు చెందిన పేరాల సాయి తేజస్వి, చింతాయపాలెం హైస్కూల్‌కు చెందిన షేక్ రిహాన్‌లకు కాటూరి వెంకటేశ్వరరావు స్వామి వివేకానంద పుస్తకాలను, నగదును విద్యార్థులకు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో ఉన్నత చదవులు చదవాలని, పలు రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, వెంకటేశ్వర్లు, పెనుమెత్స బాపిరాజు, రావి సుబాష్‌రెడ్డి, జిడుగు వెంకటేశ్వర్లు, తుమ్మల శ్రీనివాసరావు, ఆలపాటి రమణరావు, తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, లలితబాబు, కాటూరి బాజి తదితరులు పాల్గొన్నారు.



హైవెండ్ హైస్కూల్ విద్యార్థిని షేక్ జాస్మిన్‌కు నగదు పురస్కారం అందజేస్తున్న వ్యవస్థాపక అధ్యక్షుడు కాటూరి వెంకటేశ్వరరావు

## బాపట్లలో యువకుడి దారుణ హత్య

బాపట్ల, మే 15 : పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర గుర్తు తెలియని యువకుడిపై కొంతమంది దాడి చేసి హత్య చేశారు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. యువకుడు మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. పాత కక్షల నేపథ్యంలో జరిగిందా లేక ఎన్నికల వివాదాలలో భాగంగా ఈ సంఘటన జరిగిందా అనే కోణంలో పట్టణ సీఐ యు.శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం రాత్రి పాత బస్టాండ్ బార్ దగ్గర నుండి నడుచుకుంటూ వస్తున్న యువకుడిని వెనుక నుండికారులో వచ్చిన వారు ఢీకొట్టి కొందరు కారులో నుండి దిగి కత్తులతో దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



హత్యకు గురైన యువకుడి మృతదేహం

## ఆటో బోల్తా : ఆరుగురికి గాయాలు

కర్లపాలెం, మే 15 : బైకను ఢీకొట్టి ఆటో తిరగబడి పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని సత్యవతిపేట, నల్లమోతువారిపాలెం సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. నిజాంపట్నంకు చెందిన ఆటో అధిక వేగంతో వెళుతూ పక్కన ఆగి ఉన్న బైక్ ఢీకొనటంతో ఆటో పల్టీలు కొట్టింది. ఈ సంఘటనలో బైక్ వెనుక ఉన్న అతనికి, ఆటోలో ఉన్న ఒక అతనికి తీవ్రగాయాలు కాగా మిగిలిన నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108వాహనంలో బాపట్ల ఏరియా హాస్పటల్‌కు తరలించారు. గాయాలైన వారిలో ఇద్దరికి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జనరల్ హాస్పటల్‌కు తరలించారు. ఆటోను పోలీసులు కర్లపాలెం పోలీసుస్టేషన్ వద్దకు తరలించారు. హెడ్‌కానిస్టేబుల్ రహీంరెడ్డిని ఈ సంఘటనపై వివరాలు అడగగా ఆసుపత్రి నుంచి సమాచారం రాలేదని కేసు నమోదు చేయలేదని తెలిపారు.

## మట్టి ఖర్చులకు ఆర్థికసాయం

కర్లపాలెం, మే 15 : మండలంలోని పేరలి పంచాయతీ మేకలవారిపాలేనికి చెందిన మేకల రాజు మరణించగా మట్టి ఖర్చులు నిమిత్తం పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి రూ.5 వేల నగదును బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ పేరలి శ్రీనివాసరావు, గేరాయ ఏసుబాబు, కాగిత విజయరాజు, వడ్లమూడి మల్లిఖార్జున్, మద్దిబోయన బుల్లియ్య, మద్దిబోయన మల్లికార్జునరావు, మేకల విక్టర్ బాబు, బాబావలి, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance

**రిజిస్టర్డ్ ఆఫీస్:** శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండీ,చెన్నై-600032.
**నిర్వాహక కార్యాలయం:** 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,వెరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,మహాపే,నవీ ముంబై-400710.

**గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు**

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

**వేలం వేయు తేది: 25.05.2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇం.నం.27-2-7, జి.ఎన్.టి రోడ్, పద్మావతి ప్లాజా, 3వ అంతస్తు, ఎ కె నగర్ నెల్లూరు-524004**

| లోన్ ఎకౌంట్ నం | ఖాతాదారు పేరు | లోన్ ఎకౌంట్ నం | ఖాతాదారు పేరు |
|---|---|---|---|
| CHIRLPJ2311110004 | ASADI SRIHARI | CHIRLPJ2311180001 | CHEECARABOYINA BRAHMAIAH |

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ పి.బాబును సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలతో లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 15.05.2024
స్థలం : నెల్లూరు

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

# మహిళా ఓటర్ల ప్రభావం ఎవరిపై చూపేనో?

● పురుషుల కంటే మహిళలే ఎక్కువ

బాపట్ల మే 15 : బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. పురుషుల కంటే మహిళలే ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా నియోజకవర్గ పరిధిలో 1,90,925 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 92,803 మంది, స్త్రీలు 98,112 మంది, ఇతరులు 10 మంది చొప్పున ఉన్నారు. వీరిలో పురుషులు 77,256 మంది ఓటు హక్కు వినియోగించుకోగా స్త్రీలు 81,237 మంది, ఇతరులు 7 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే బాపట్ల మండలంలో పురుషులు 29,150 మంది ఓటర్లు ఉండగా అందులో 25,560 మంది, స్త్రీలు 30,381 మంది ఓటర్లు ఉండగా అందులో 26,494 మంది ఇతరులు ఐదుగురు ఉండగా ముగ్గురు చొప్పున ఓట్లు వేశారు. మొత్తం 87.44 శాతం ఓట్లు పోలయ్యాయి.

బాపట్ల పట్టణంలో పురుషులు 28,113 మంది ఓటర్లు ఉండగా 20,895 మంది, స్త్రీలు 30,716 మంది ఓటర్లు ఉండగా 22,589 మంది, ఇతరులు నలుగురు ఉండగా ముగ్గురు చొప్పున తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 73.92 శాతం ఓట్లు పోలయ్యాయి. కర్లపాలెం మండలం పరిశీలిస్తే పురుషులు 20,550 మంది ఓటర్లు ఉండగా 17,901 మంది, స్త్రీలు 21,125 మంది ఓటర్లు ఉండగా 18,606 మంది, ఇతరులు ఒక్కరు చొప్పున ఓట్లు వేశారు. మండలంలో మొత్తం 87.60 శాతం ఓట్లు పోలయ్యాయి. పిట్టలవానిపాలెం మండలంలో పురుష ఓటర్లు 14,990 మంది ఉండగా 12,900 మంది, స్త్రీలు 15,890 మంది ఉండగా 13,548 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ 85.65 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో అత్యధిక శాతం కర్లపాలెం మండలంలో పోలు కాగా తక్కువ శాతం బాపట్ల పట్టణంలో పోలయ్యాయి. మొత్తం 1,58,500 మంది ఓటర్లు ఈ పర్యాయం తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 83.02 శాతం ఓట్లు నమోదయ్యాయి.



బాపట్లలో ఓట్లు వేసేందుకు క్యూ కట్టిన మహిళలు

ఈవిధంగా నియోజకవర్గంలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఓట్లు కూడా మహిళలే ఎక్కువ మంది వేశారు. దీంతో అభ్యర్థుల తలరాత మహిళలే మార్చనున్నారు. అభ్యర్థులు మాత్రం మహిళా ఓటర్లు తమ పక్కనే ఉన్నారంటే ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పురుషుల కంటే అధికంగా 3,981 మంది మహిళలు ఓట్లు వేశారు. అభ్యర్థుల గెలుపునకు ఈ పర్యాయం ఈఓట్లే కీలకంగా మారనున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జూన్ 4వ తేదిన అభ్యర్థుల తలరాత వీరే మార్చనున్నారు.

# గడియార స్తంభం కూడలిలో మరోసారి పగిలిన పైపులైన్

● వృథా అవుతున్న తాగునీరు
● పట్టించుకోని అధికారులు



టీటీ రోడ్డు కింద దెబ్బతిన్న పైపులైన్ నుంచి రోడ్డుపైకి ప్రవహిస్తున్న తాగునీరు

బాపట్ల, మే 15 : బాపట్ల పట్టణంలోని గడియార స్తంభం కూడలిలో తాగునీటి పైపులైన్ మరోసారి పగిలింది. గత ఏడాది నుంచి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌లు అనేకచోట్ల పగలటం తాగునీరు వృథా కావటం, దీనివల్ల సమ్మర్ స్టోరేజిలో ట్యాంక్‌లోని నీరు అడుగంటటం వల్ల వేసవికి ముందునుంచే పట్టణ ప్రజలకు రోజు మార్చి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. అధికారుల నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోకపోవటం వల్ల ఈ ఏడాది తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. గడియార స్తంభం కూడలిలో ఇప్పటికే పైపులైన్‌ల మరమ్మతులు సుమారు 15సార్లు చేశారు. ఇటీవల మెయిన్ పైపులైన్ దెబ్బతినటంతో రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేశారు. గత 10 రోజులుగా సూర్యలంక వైపు వెళ్ళే పైపులైన్ పగిలి నీరు రోడ్డుపైకి వచ్చి వృథా అవుతున్నప్పటికి ఎన్నికల ప్రక్రియలో ఉన్నామని అధికారులు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. దీనివల్ల ప్రతిరోజు నీరు రోడ్డు మీద కాల్వలా ప్రవహిస్తున్నది. వెంటనే మరమ్మతులు చేయకుంటే పైపులైన్ ఎక్కువగా దెబ్బతిని నీరు పెద్ద ఎత్తున వృథా అయ్యే ప్రమాదం ఉంది. కావున అధికారులు దీనిపై స్పందించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా తాగునీటి పైపులైన్ సూర్యలంక ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్‌కు వెళ్ళేదని, దానిని మరమ్మతులు చేయించాలని వారి దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. కమిషనర్ బి.శ్రీకాంత్‌ను వివరణ కోరగా వెంటనే పైపులైన్ మరమ్మతులు చేయించి తాగునీరు వృథా కాకుండా చూస్తామని చెప్పారు.

# డ్రెయిన్లలో పేరుకుపోతున్న గుర్రపు డెక్క

● రైతులు విన్నవించుకున్నా పట్టించుకోని అధికారులు

చెరుకుపల్లి, మే 15 : తీర ప్రాంతంలో ఎక్కడా పూడికలు తీయటం కాని, గుర్రపుడెక్క తొలగించటంకాని చేసిన దాఖలాలు లేవు. ఏటా అధిక వర్షాలతో పంట పొలాల్లో తిష్టవేసే నీరు బయటకు పోవాలంటే డ్రెయిన్లలో నీరు పోయేలా ఉండాలి. ఈ విధంగా గుర్రపు డెక్క, తూటికాడతో పూడుకుపోయి ఉంటే పంట పొలాల్లో నిలిచిన నీరు ఏ విధంగా పోతుందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లలో పూడికపోయిన గుర్రపుడెక్క, తూటికాడకు తొలగించాలని ఎన్నిసార్లు డ్రెయినేజి అధికారులకు తెలిపినా పట్టించుకోవటంలేదంటూ ఆరోపిస్తున్నారు. తీర ప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాలలో సుమారు లక్షా 20వేల ఎకరాలకుపైనే వరి సాగు చేస్తున్నారు. అధిక వర్షాల కారణంగా పంట పొలాల్లోని వర్షపునీరు బయటకు వెళ్ళక ఏటా లక్షలాది రూపాయలు నష్టపోతున్నామని దీనికి కారణంగా డ్రెయిన్లలో మురుగునీరు పారుదల కాకపోవటమే ప్రధాన కారణం.

### తీరంలో ప్రధాన డ్రెయిన్లలో ఏపుగా గుర్రపుడెక్క

రేపల్లె మండలంలో అరవపల్లి, జగజ్జేరు, ఉప్పూడి, సింగుపాలెం సమీపంలోని బడే కాలవ, నగరం మండలంలోని మంగళగుంట డ్రెయిన్, గంగోలు డ్రెయిన్, అద్దంకివారిపాలెం డ్రెయిన్లలో, చెరుకుపల్లి మండలంలో ఊచావారిపాలెం ఓల్డ్ కోర్స్‌డ్రెయిన్, రాజోలు నుంచి గూడవల్లి, పొన్నపల్లి, ఆరేపల్లి, బలుసులపాలెం, తుమ్మలపాలెం మీదుగా నిజాంపట్నం మండలం చింతరేవు మెయిన్ డ్రెయిన్ వెంట వేలాది ఎకరాలు వరి పంట రైతులు పండిస్తున్నారు. ఏటా డ్రెయిన్లలో మురుగునీరు పారుదల కాక కోట్లాది రూపాయలు నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో వర్షాలు పడినపుడు మాత్రం అధికారులు హడావుడిగా వంతెన సమీపంలో పూడిక తీతలు తీస్తూ లక్షలాది రూపాయలు బిల్లులు చేసుకుంటున్నారే తప్ప రైతులకు మాత్రం ఎలాంటి ఉపయోగం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి ఈ వేసవిలోనైనా తీర ప్రాంతంలోని ప్రధాన డ్రెయిన్లలో తక్షణమే గుర్రపు డెక్క తొలగించి మరమ్మతులు నిర్వహించాలంటూ తీర ప్రాంత రైతులు కోరుతున్నారు.



అరవపల్లి డ్రెయిన్లో ఏపుగా పెరిగిన గుర్రపుడెక్క



[illegible]



చెరుకుపల్లి మండలం ఊచావారిపాలెం ఓల్డ్‌కోర్స్ డ్రెయిన్లో తొలగించని గుర్రపుడెక్క

# భట్టిప్రోలులో అధ్వాన పారిశుధ్యం

● దోమలతో అల్లాడుతున్న ప్రజలు
● చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు

భట్టిప్రోలు, మే 15: పంచాయతీ అధికారుల అలసత్వం అస్త వ్యస్త డ్రైనేజీ వ్యవస్థ కారణంగా భట్టిప్రోలులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో దోమలు విజృంభిస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామంలోని మెయిన్‌రోడ్డులో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. వర్షం కురిస్తే మెయిన్‌రోడ్డులో పరిస్థితి మరింత దారుణంగా ఉం ది. డ్రెయినేజి నీరు వర్షం నీటితో కలిసి రోడ్డుపై ప్రవహిస్తుంది. ఒకవైపు ముందుకు కదలని మురుగుతో భరించలేని దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. 16 వార్డులు కలిగిన మేజర్ పంచాయతీ భట్టిప్రోలులో సుమారు 18 వేల జనాభా నివాసం ఉంటున్నారు. దీనికి ఆదాయం ఘనంగా ఉన్నప్పటికి పారిశుధ్య నిర్వహణలో మాత్రం వెనుకంజలో ఉంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డ్రెయినేజి వ్యవస్థ నిరుపయోగంగా మారడం వల్ల ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఉండడంతో ప్రజ ల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. డ్రెయినేజి సమస్య పరిష్కారానికి ఇటీవల పలు వార్డుల్లో నిర్మించిన కల్వర్టులు నిరుపయోగంగా మారాయి. మెయిన్‌రోడ్డుతో పాటుగా రైలుపేట, కొత్తపేట, మార్కెట్ వెనుకబజార్‌లతో పాటుగా దళితవాడల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోజుల తరబడి మురుగునీరు ముం దుకు కదలక రంగుమారి తీవ్ర దుర్వాసన వస్తోందని ఇళ్లల్లో నివసించ లేకపోతున్నామని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క వార్డులో కూడా మురుగు నీరు ముం దుకు కదలని పరిస్థితి నెలకొందంటే అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే డ్రెయినేజీల నిర్వహణలో పంచాయతీ అధికారుల వైఫల్యం గ్రామస్థుల పాలిట శాపంలా మారింది. దోమలు విజృంభిస్తూ దాడి చేస్తున్నాయని ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతాయోమోనని ప్రజలు భయపడుతున్నారు. భారీ వర్షాలు కురి స్తే రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయని రాకపోకలు సాగించేందుకు కూడా ఇబ్బందికరంగా ఉంటుందని ఆయా వార్డుల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టి లో ఉంచుకుని అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో డ్రెయినేజి లో పూడికతీత పనులు నిర్వహించి మురుగుపారుదలకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



స్థానిక డీసీసీ బ్యాంక్ ముందు సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగునీరు



స్థానిక లైబ్రరీ ముందు మురుగు కాలువ దుస్థితి

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

## భావదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బాపట్ల,మే 15 : బాపట్ల పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణ స్వామి 1431వ నవహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ఉదయం తిరుమంజనోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, పెండ్లికుమారుని ఉత్సవం, అంకురార్పణ, ధ్వజారోహణం, భక్తులకు ప్రసాదవినియోగం జరిగింది. కార్యక్రమంలో భాగంగా అర్చకస్వాములు, ఆలయసిబ్బంది స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.



భావదేవునికి అభిషేకం చేస్తున్న పండితులు

## సాదాసీదాగా మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

కొల్లూరు, మే 15: మండలపరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో లక్ష్మీకుమారి నిర్వహించారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను వివరించారు. జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైఎస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఏవో సోమయాజులు, ఆయా ప్రభుత్వ శాఖల మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీకుమారి

## నిజరూప అమ్మవారిగా శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మే 15 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి శతజయంతి తిరునాళ్ల మహోత్సవాలను పురస్కరించుకొని శ్రీబగళాముఖి అమ్మవారు నిజరూప అమ్మవారిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి 108 కలశాలతో వివిధ రకాలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు వార్షిక తిరునాళ్ళ మహోత్సవాలకు అఖండ జ్యోతి ప్రజ్వలన గావించారు. 10 గంటలకు అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. 10.30 నుంచి భక్తులతో వివిధ రకాల వస్తువులతో తులాభార సమర్పణ గావించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శ్రీబగళాముఖి అమ్మవారు

## ఫోరం ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీలకు సన్మానం

బాపట్ల,మే 15 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించినందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఫోరంఫర్‌బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో సన్మానించారు. ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, చిత్రకారుడు జీవీతో కలిసి కలెక్టరేట్‌లో వారిని సత్కరించి సన్మానించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో అన్ని చర్యలు తీసుకొని సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించారని సాయిబాబు పేర్కొన్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించటంలో ఇద్దరు అధికారులు విశేషంగా కృషి చేశారని కొనియాడారు.



కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌ను సన్మానిస్తున్న డాక్టర్ పీసీ.సాయిబాబు తదితరులు

## వేమూరులో ఎన్నికల అధికారికి సత్కారం

వేమూరు, మే 15 : నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేసిన నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడును బుధవారం వేమూరులో సత్కరించారు. ఎంపీడీవో శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలను తూచా తప్పకుండా పాటించి సజావుగా ఎన్నికలు జరిగేందుకు ఎంతగానో కృషి చేసిన వసంతరాయుడు అభినందనీయులు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఈవోపీఆర్‌డీ శేఖర్, విద్యాశాఖ అధికారి రోజ్‌ల్యాండ్, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఓటీపీ చెప్పాడు.. రూ.1.38 లక్షలు మాయం

కొల్లూరు, మే 15: ఆన్‌లైన్ షాపింగ్ చేసిన ఓ యువకుడికి నగదు వాపసు చేస్తామంటూ ఓటీపీ చెప్పమని ఖాతాలో నగదు తస్కరించిన వైనంపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని దోనేపూడి గ్రామానికి చెందిన కొల్లి కళ్యాణ్‌కుమార్ ఇటీవల ఆన్‌లైన్‌లో పౌచ్ ఆర్డర్ చేశాడు. తనకు ఎంపిక చేసుకున్న కలర్ కాకుండా మరో కలర్ పౌచ్ పంపించడంతో దానిని రద్దు చేసుకున్నాడు. ఈ క్రమంలో రద్దు చేసిన పౌచ్‌కు కట్టిన నగదు వాపసు చేస్తామంటూ మంగళవారం వాట్సాప్ కాల్ చేసి ఓటీపీ అడిగి తీసుకున్నారు. అనంతరం బ్యాంకు ఖాతా నుంచి రూ.1,38,500లు తస్కరించడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్‌గా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పిచ్చికుక్క దాడిలో 8 మందికి తీవ్రగాయాలు

రేపల్లె, మే 15 : రహదారి వెంట వెళుతున్న మహిళలపై పిచ్చికుక్క విచక్షణా రహితంగా దాడి చేయటంతో 8 మందికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చెరుకుపల్లి మండలం రాజవోలు, బడేవారిపాలెం, పొన్నపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఒక్కసారిగా రహదారి వెంట వెళ్ళే మహిళలపై ఊరకుక్క మీదపడటంతో కిందపడటంతో తలపైన తీవ్రంగా కరవటంతో గాయాలపాలయ్యారు. రాజవోలుకు చెందిన బొడ్డు భానుప్రకాష్, దొంతుబోయిన నాగరాజురెడ్డి, బడేవారిపాలేనికి చెందిన ఎలిశెట్టి వెంకాయమ్మ, బడే వీరమ్మ, బడే పిచ్చమ్మ, సుభాష్‌సాయి, పొన్నపల్లికి చెందిన ఉప్పు రాంబాబు, ఉప్పు సత్యలకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు బాధితులను తరలించారు. అక్కడ వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు.



పిచ్చి కుక్కకరవటంతో పాలైన మహిళలు, తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

# టీడీపీ శ్రేణుల్లో సర్వేల జోష్

- కూటమికే విజయావకాశాలు
- బెట్టింగ్‌లకు ముందుకొస్తున్న పలువురు
- వెనక్కి తగ్గుతున్న వైసీపీ నాయకులు
- ఆ కేడర్‌లో ఆందోళన
- గొట్టిపాటిని కలుస్తున్న గ్రామాల నేతలు


గొట్టిపాటిని కలిసిన వల్లాపల్లి టీడీపీ నేతలు

బల్లికురవ, మే 15 : పోలింగ్ ముగిసి రెండు రోజులు కావడం పలు సంస్థల సర్వేలు టీడీపీ కూటమికే అధిక సీట్లు వస్తాయని ప్రకటిస్తుండడంతో టీడీపీ శ్రేణులో జోష్ నెలకుంది. గ్రామాల్లో పోలింగ్ తీరును విశ్లేషించుకుంటున్న నేతలు గెలుపు అవకాశాలపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి నియోజకర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు ఈసారి అన్ని మండలాల్లో మంచి మెజారిటీ వస్తుందని వారు అంటున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ నుండడంతో కూటమికి 120కి పైగా సీట్లు వస్తాయని, ఎమ్మెల్యే గొట్టిపాటి 20వేల మెజార్టీతో గెలుపొందుతారంటూ పలువురు బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నారు. బల్లికురవ మండలంలో టీడీపీకి 2500పైబడి మెజార్టీ వస్తుందని లక్షల్లో బెట్టింగ్‌లు కాశారు. టీడీపీ వైపు నుంచి ఎక్కువ మంది బెట్టింగ్‌లకు సిద్ధమవుతున్నా వైసీపీ నేతలెవరూ ముందుకు రావడంలేదు. పోలింగ్ ముగిశాక బెట్టింగ్‌లకు ఎవరు ముందుకు రావడం లేదని టీడీపీ నేతలు అంటున్నారు. కొన్ని గ్రామాలపై కూడా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎవరికి వారు గ్రామాలపై మెజార్టీపై కూడా బెట్టింగ్‌కు సిద్ధమవుతున్నారు. జాతీయ సర్వేలు కూడా టీడీపీ కూటమికి జై కొట్టడంతో గ్రామాలలో టీడీపీ కార్యకర్తలు కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎవరికి వారు సంతోషంలో మునిగి తేలుతున్నారు. ఐదేళ్లలో గ్రామాలలో అభివృద్ధి అనే మాటేలేదన్నారు. టీడీపీ కూటమి రాగానే అభివృద్ధి పనులు మొదలు పెడతామని అంటున్నారు.

### ఎమ్మెల్యేను కలిసేందుకు భారీగా వెళ్తున్న శ్రేణులు

నెల రోజుల నుంచి గ్రామాలలో ఎన్నికల సందడి సాగింది. ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని టీడీపీ కూటమి శ్రేణులు ఐక్యతతో నిర్వహించారు. గొట్టిపాటికి భారీ మెజార్టీ తేవాలని సమన్వయంతో పనిచేశారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తండోపతండాలుగా తమ నేత గొట్టిపాటిని కలిసేందుకు తరలివస్తున్నారు. రెండురోజులుగా చిలకలూరిపేటలో ఆయన నివాసానికి వెళ్లి కలిసి ముందస్తు అభినందనలు తెలుపుతున్నారు. గ్రామాలవారీగా ఎన్నికల తీరుపై, ఫలితాలను గొట్టిపాటి దృష్టికి తీసుకెళ్తున్నారు.


శాంతినగర్‌లో బారులు తీరిన మహిళలు.. ఐక్యనగర్‌లో ఈవీఎంలు ఆగిపోవడంతో వేచి ఉన్న వృద్ధులు

## సార్వత్రిక ఎన్నికల్లో అతివల ఓట్లే కీలకం

- సింహభాగం ఓట్లు వారివే
- చీరాల ఎమ్మెల్యే స్థానాన్ని నిర్ణయించనున్న మహిళలు

చీరాలటౌన్, మే 15 : 2024 సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యే స్థానాన్ని నిర్ణయించడంలో అతివల ఓట్లే కీలకంగా మారాయి. ఓటర్లలోనే కాకుండా ఓటు హక్కు వినియోగించుకున్న సంఖ్యలో కూడా మహిళలే అధికంగా మారి ముందంజలో ఉన్నారు. ఈక్రమంలో వీరి ఓట్లపైనే ప్రధాన పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. ఒకవైపు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు చేరువుగా ఉన్నాయి. కావున కచ్చితంగా విజయం మాదేనంటూ తమ్ముళ్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నేరుగా మహిళలకు సంక్షేమ పథకాలు ఇచ్చామని, విజయం మాదేనంటూ వైసీపీ శ్రేణులు ఉన్నాయి.

**2024 సార్వత్రిక ఎన్నికల చీరాల అసెంబ్లీ వివరాలు**

| | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| | 98,729 | 1,03,958 | 24 | 2,02,711 |
| పోలైనవి : | 81,772 | 85,681 | 13 | 1,67,466 |

సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి కచ్చితంగా 82.61 శాతంతో పెరిగిందనే చెప్పాలి. నియోజకవర్గంలో పలు చోట్ల గంటల కొద్దీ ఈవీఎంలు మొరాయించాయి. అంతేకాకుండా ఎండలు కూడా ఆరోజు భగ్గుమన్నాయి. కానీ ఓటర్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఓటును వినియోగించుకున్నారు. కానీ అధికారులు వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపించింది. గత ఎన్నికల సమయంలో ఈవీఎంలు గంటలకొద్దీ ఆగిపోయి పోలింగ్ చాలా ఆలస్యంగా జరిగింది. అలాంటప్పుడు ఈసారి ఆ పొరపాటు మళ్లీ జరుగకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా చర్య లు తీసుకోలేదు. దీంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావల్సిన పోలింగ్ ఆది నుంచే మిషన్లు సతాయిస్తూ స్లోగా ముందుకు సాగింది. దీం తో ఓటర్లు గంటల కొద్దీ ఎండలో నిల్చుని అవస్థలు పడుతూ పడిగాపులు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా బూత్ నెంబర్ 76 ఐక్యనగర్‌లో మూడు సార్లు ఈవీఎంలు ఆగిపోయాయి. దీంతో అక్కడ అన్ని పార్టీలకు చెందిన ఏజెంట్ల సంతకాలతో ఈవీఎంలు మార్చి, మార్చి ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఎన్నికలు ముగిశాయి. మొత్తంగా మహిళలు ఎవ్వరికి పట్టం కడతారో వేచి చూడాల్సి ఉంది.


సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య, టీడీపీ నేతలు

## గెలుస్తున్నాం.. అభివృద్ధిలో ముందుంటాం

**టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య**

చీరాల, మే 15 : ఎన్నికల్లో చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుస్తున్నాం. అభివృద్ధిలో ముందుంటామని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. తన గెలుపునకు సహకరించిన కూటమి శ్రేణులు, నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో చెదురుమదురు ఘటనలు తప్ప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వ్యూహాత్మకంగా పనిచేశారన్నారు. నియోజకవర్గంలో అన్నివర్గాల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం చీరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు. చంద్రబాబు తనను నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహించారన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో చంద్రబాబు సహకారం తనకు పూర్తిస్థాయిలో ఉంటుందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి, వీరయ్యచౌదరి, నాశిక వీరభద్రయ్య, గజవల్లి శ్రీనివాసరావు, బొగ్గుల పార్థసారధి, గూడూరు శివరామప్రసాద్, సయ్యద్ బాబు, కౌతవరపు జనార్దనరావు, ఎంఆర్ఎఫ్ రమేష్ పాల్గొన్నారు.

## రేపు బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవం

మార్టూరు, మే 15 : మండల పరిధిలో మార్టూరు గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి వద్ద పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం స్వామి వారి ఆరాధన, గురుపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తామని అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని, మార్టూరు ప్రాంత భక్తులు అందరూ హాజరై స్వామి వారి ఆశీస్సులను పొందాలని కమిటీ సభ్యులు కోరారు.

## పూనూరులో అర్చకుడు మృతి

యద్దనపూడి, (మార్టూరు) మే 15: యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ రెండవ అర్చకులు జీవీ నరసింహాచార్యులు (51) అనారోగ్య కారణంగా బుధవారం వేకువ జామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అర్చకత్వంతోపాటు ప్రైవేటు వైద్యునిగా రూపాయి ఫీజు తీసుకోకుండా వైద్య సేవలందించేవారు. బుధవారం ఉదయం పూనూరు గ్రామస్థులతోపాటు, చుట్టుపక్కల గ్రామాల వారు తరలి వచ్చి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సాయంత్రం నరసింహాచార్యులు అంత్యక్రియలు పూర్తయ్యాయి.

## 19న గంగవరంలో మెడికల్ క్యాంప్

ఇంకొల్లు, మే 15 : మండలంలోని గంగవరం మంచాల వెంకట్రామయ్యరంగమ్మ కల్యాణ మండపంలో ఈ నెల 19వ తేదీన ఆదివారం గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ రోగులకు కేవలం రెండు వందల రూపాయలకే రెండు నెలలకు సరిపడా మందులను అందజేయనున్నారు. ఈ అవకాశాన్ని గంగవరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మంచాల రమేష్ బాబు కోరారు.

## మండలంలో పోలైన ఓట్లు 34,792

ఇంకొల్లు, మే 15 : ఇంకొల్లు మండలంలో 13 పంచాయతీల పరిధిలో 20 గ్రామలలో 54 కేంద్రాలలో పోలింగ్ నిర్వహించగా 34,792 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఇంకొల్లు మండలంలో మొత్తం 40,480 ఓటర్లు ఉండగా 34792 మంది జరిగిన ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంకొల్లు పంచాయతీలో ఇంకొల్లు, హనుమోజిపాలెం, గొల్లపాలెం గ్రామాలలో 20 వార్డులలో 13,591 ఓటర్లు ఉండగా, 11364 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## కోనంకిలో గొడవపై నాలుగు కేసులు

మార్టూరు, మే 15 : ఎన్నికలు పోలింగ్ జరిగిన సోమవారం నాడు మండలంలోని కోనంకి గ్రామంలో తెలుగుదేశం వైసీపీ పార్టీ కార్యకర్తలకు మధ్య జరిగిన గొడవలో గాయపడిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగు క్రిమినల్ కేసులను నమోదు చేసినట్లు మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్ వీ రాజశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. రెండు పార్టీలకు చెందిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన 15 మందిపై, వైసీపీకి చెందిన 15 మందిపై కేసు నమోదు చేశామన్నారు. తహసీల్దారు వద్ద బైండోవర్ చేశామన్నారు.

## మహిళా కార్మికులకు చీరల పంపిణీ

మార్టూరు, మే 15 : మార్టూరులో గ్రానైట్ పరిశ్రమ యజమాని పొత్తూరి శివ దంపతులు తమ వివాహ దినోత్సవం సందర్భంగా బుధవారం గ్రామ పంచాయతీలోని మహిళా పారిశుద్ధ్య కార్మికులకు, ఎస్‌టీ కాలనీలోని పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

## పెరిగిన పోలింగ్ ఎవరికి లాభం..?

చీరాల, మే 15 : చీరాల నియోజకవర్గంలో పోలింగ్ శాతం గతంలో కంటే భారీగా పెరిగింది. అది ఎవరికి లాభిస్తుందనే అంశంపై రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. చీరాల నియోజకవర్గంలో మొత్తం 2,02,711 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 98, 729మంది, మహిళలు 1,03,958 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. వారిలో 1,67,466 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81,772 మంది పురుషులు, 85,681 మంది మహిళలు, ఇతరులు 13 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 218 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. అందులో వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం బూత్ నెంబరు 172లో అత్యధికంగా 1226 ఓట్లు పోలయ్యాయి. కొత్తపేట వివేకానందకాలనీలో బూత్ నెంబరు 154లో అత్యల్పంగా 380 ఓట్లు పోలయ్యాయి. ఈ క్రమంలో రాజకీయ విశ్లేషకులు తమ అంచనాలకు పదును పెడుతున్నారు. కూడికలు, తీసివేతలతో బిజీబిజీగా ఉన్నారు.

## వాగు లోకి దూసుకుపోయిన కారు

**వ్యక్తి మృతి, పలువురికి గాయాలు**

కారంచేడు(పర్చూరు), మే 15: కారు అదుపుతప్పి వాగులోకి దూసుకుపోయి వ్యక్తి మృతి చెందగా, పలువురికి స్వల్పగాయలైన సంఘటన కారంచేడు మండల పరిధిలోని రామానాయుడు వారధి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. చిలకలూరిపేట నుంచి కుటుంబ సభ్యులతో వాడరేవు వెళతుండగా కారు అదుపు తప్పి పక్కనే ఉన్న వాగులోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో కారు డ్రైవర్ మహబూబ్ సుభాని(55) మృతి చెందగా, కారులో ఉన్న మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న కారంచేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై సురేష్ తెలిపారు.

## వ్యక్తిపై మరోవ్యక్తి ఇనుపరాడ్‌తో దాడి

చీరాలటౌన్, మే 15 : వ్యక్తిపై మరోవ్యక్తి ఉద్దేశపూర్వకంగా ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక విఠల్‌నగర్‌లోని పోలేరమ్మ గుడి సమీపానికి చెందిన పట్నాన పాపారావు సిమెంట్ లోడ్ ఆటో డ్రైవర్, అలాగే అదే ప్రాంతానికి చెందిన బస రాంబాబు బోరింగ్స్ పని చేస్తుంటాడు. వీరిద్దరికీ మంగళవారం రాత్రి ఓ కార్యక్రమంలో భోజనాల వద్ద వివాదం జరిగింది. ఈక్రమంలోనే బుధవారం పనికి వెళ్లేందుకు ఆటో ఇంటి వద్ద బయటకు తీస్తున్న సమయంలో రాంబాబు పథకం ప్రకారం వచ్చి ఒక్కసారిగా ఇనుపరాడ్డుతో గట్టిగా తలపై మోది పరారయ్యాడు. ఈ నేపథ్యంలో పాపారావు రక్త గాయలతో ఉండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

## ధర్మం వైపు నిల్చున్న ఓటర్లు

- కూటమి విజయం తథ్యం
- ప్రజా తిరుగుబాటు వైసీపీకి గుణపాఠం కానుంది
- ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు (అద్దంకి), మే15 : మంచికి, చెడుకు మధ్య జరిగిన ఎన్నికల్లో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ధర్మం వైపు నిలబడ్డారని ఎమ్మెల్యే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నేతలతో రవికుమార్ ఎన్నికల సరళిపై చర్చించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందుకే భారీ ఓటింగ్ నమోదైం దన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమన్నారు. చంద్రబాబు నిర్విరామ కృషికి ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలువబోతున్నాయన్నారు. ఎన్నికలలో పవన్‌కల్యాణ్, బీజేపీ నేతల కృషి మరువలేనిదన్నారు. ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్‌కు, తెలుగుజాతి ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పు చిరకాలం గుర్తుండబోతుందన్నారు. వైసీపీ సీనియర్ నాయకులకు సైతం డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి స్థానికంగా ఓటర్లు భారీగా తరలి వచ్చి ఎన్నో కష్టాలు ఎదురైనా ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివచ్చినందుకు రవికుమార్ ధన్యవాదములు తెలిపారు. ప్రజా తిరుగుబాటు వైసీపీకి గుణపాఠం కాబోతుందని, ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం, అద్దంకి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని గొట్టిపాటి ధీమా వ్యక్తం చేశారు. పలు మండలాల నేతలు ఆయా గ్రామాలలో వచ్చే మెజార్టీల వివరాలను రవికుమార్‌కు వివరించారు.

## అద్దంకిలో 88 శాతం పోలింగ్

**అధికంగా వినియోగించుకున్న పురుష ఓటర్లే**


జూనియర్ కాలేజీ వద్ద బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

అద్దంకి, మే 15 : అద్దంకి నియోజకవర్గంలో 13వ తేదీ జరిగిన పోలింగ్ లో 88.25 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్వో సునీల్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం లో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉండగా 2,15,375 మంది ఓటు హక్కు వినియోగించుకొని 88.25 శాతం ఓటింగ్ జరిగింది. మొత్తం 1,19,570 మంది పురుషులు కాగా 1,05,718 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.42 శాతం మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మహిళా ఓటర్లు 1,24,475 మంది కాగా 1,09,654 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.10 శాతం మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు 12 మంది కాగా ముగ్గురు మా త్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 25 శాతం మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్ల పరంగా పరిగణలోకి తీసుకుంటే పురుషులు 1,05,718 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, మహిళలు 1,09,654 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం పరిగణలోకి తీసుకుంటే పురుషులు 88.42 శాతం, మహిళలు 88.10 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటర్ల పరంగా మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నప్పటికీ ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషుల కంటే మహిళల శాతమే తక్కువ.


SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బౌరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

**గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు**

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

**వేలం వేయు తేది: 25.05.2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇం.నం.27-2-7, జి.ఎస్.టి రోడ్, పద్మావతి ప్లాజా, 3వ అంతస్తు, ఎ కె నగర్ నెల్లూరు-524004**

| లోన్ ఎకౌంట్ నం | ఖాతాదారు పేరు | లోన్ ఎకౌంట్ నం | ఖాతాదారు పేరు |
|---|---|---|---|
| CHIRLPJ2311110004 | ASADI SRIHARI | CHIRLPJ2311180001 | CHEEDARABOYINA BRAHMAIAH |

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. **వేలం సమయం:11.00 AM** మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ పి.బాబును సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 15.05.2024
స్థలం : నెల్లూరు

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్


## ఓటేసేందుకు వచ్చి..ప్రాణాలు వీడి

- చిలకలూరిపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- టిప్పర్‌ను ఢీకొట్టి దగ్ధమైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు
- నీలాయపాలెంవాసులు నలుగురు దుర్మరణం
- వారిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు
- ఇద్దరు డ్రైవర్లు మృతి


బస్సులోని మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

పర్చూరు, మే 15 : సొంతూరిపై మమకారం.. ఓటు వేయాలన్న దృఢ సంకల్పం.. పిల్లాజెల్లతో ఇంటిల్లిపాదీ సొంత ఊళ్లకు వచ్చారు. ఓటు హక్కును హక్కు బాధ్యతగా భావించి, ఓటేసి తిరిగి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దుర్మణం పాలయ్యారు. ఓటేసేందుకు సొంత ఊళ్లకు వచ్చి ఒక్కరోజు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. తిరిగి వారు ఉద్యోగ, వ్యాపారాలు చేసే ప్రాంతాలకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతలోనే మృత్యువు కాటేసింది. ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామ సమీపంలో ప్రమాదం జరిగింది. చినగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన ఒకే కుటుంబంవాళ్లు కాశీ బ్రహ్మేశ్వరరావు (65), భార్య లక్ష్మి (60), మనవరాలు ఖ్యాతి (10సం), అదే మండలం గొనశపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (54) సజీవదహనమయ్యారు. నీలాయపాలెం గ్రామానికి చెందిన 10 మంది బస్సులో ప్రయాణిస్తుండగా, అందులో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు మృతి చెందడం విషాదకరం.

ఈసంఘటనలో ఇద్దరు డ్రైవర్‌లతో సహా బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. కళ్లు తెరిచేలోపే బస్సు కాలి బూడిదయింది. గాఢ నిద్రలో ఉన్న పదుల సంఖ్యలో ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి. స్థానికులు అప్రమత్తమై 108, పోలీసులకు సమాచారం ఇచ్చారు.

### మిన్నంటిన ఆర్తనాధాలు

అర్ధరాత్రి కారుచీకట్లో బస్సు అగ్నికి అహుతి కావడం అందులో ఉన్న ప్రయాణికులు అగ్నికి అహుతి అవుతూ చేసిన ఆర్తనాదాలు పలువురిని దిగ్భ్రాంతికి గురిచేశాయి. అసలు ఏమి జరిగిందో ఏమీ జరగబోతుందో అర్థంకాని స్థితిలో ప్రాణాలతో బయట పడిన వారు తీవ్ర ఆందోళనకు గురిఅయ్యారు.

### మాసంపు ముద్దల్లా మృతదేహాలు

ఒక్కసారిగి బస్సు దగ్ధం కావడంతో అందులో ఉన్న ప్రయాణికులు సజీవదహనమయ్యారు. బస్సులో మృతదేహాలు చల్లాచెదురుగా గుర్తించలేని స్థితిలో మాంసం ముద్దల్లా మారాయి. ఎవరి మృతదేహం అనేది గుర్తించలేని స్థితి నెలకొంది.

### కంటతడి పెట్టించిన ప్రమాదం

ఘటనా స్థలంలో బస్సులో మృతి చెంది చెల్లాచెదురుగా మాంసం ముద్దల్లా పడిఉన్న మృతదేహాలు చూపరులను కంటతడి పెట్టించాయి. బంధువుల రోదనలు మిన్నంటాయి.

## బస్ ప్రమాదంలో చీరాలవాసి దుర్మరణం

- మరో 15 రోజుల్లో కుమార్తె నిశ్చితార్థం..ఈలోపే ఘటన
- ప్రమాదం జరిగిన సుమారు 10 గంటల తరువాత కుటుంబ సభ్యులకు సమాచారం
- పెద్ద దిక్కును కోల్పోయి బోరున విలపిస్తున్న కుటుంబం
- రాలేనని చెప్పినా ట్రావెల్స్ వారు బలవంతంగా తీసుకెళ్లారని బంధువులు ఆరోపణ



చీరాలటౌన్, మే 15 : చిలకలూరి పేట వద్ద అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చీరాల సమీపంలోని పేరాలకు చెందిన షేక్ మస్తాన్ షరీఫ్(45) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం షరీఫ్ సుమారుగా 25 సంవత్సరాలుగా కారు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కొంత కాలంగా చీరాల్లోని ఓ ప్రైవేటు బస్‌కు కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి భార్య నజ్మా, కుమార్తె రిజ్వాన, కుమారుడు అబ్బాస్ సంతానం. అయితే కుమారుడిని చదివించే స్తోమత లేకపోవడంతో వెల్డింగ్ పనికి వెళుతున్నాడు. కుమార్తెకు నూజివీడులో మంగళవారం సంబంధం కుదిరింది. ఈనెల 30న నిశ్చితార్థంకు మాట్లాడుకున్నారు. అయితే నూజివీడు నుంచి ప్రయాణం చేసి రాత్రికి ఇంటికి చేరారు. అయితే ట్రావెల్స్ యజమాని కచ్చితంగా బస్‌కు రావాల్సిందేనని తీసుకువెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెప్తున్నారు. కానీ రాత్రి 10 గంటల తరువాత డ్యూటీకి వెళ్లిన తరువాత బుధవారం ఉదయం 10 గంటలకు సంఘటన స్థలం నుంచి ఫోన్ వచ్చిందని కుటుంబ సభ్యులు చెప్తున్నారు. ప్రమాదంలో షరీఫ్ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విపిస్తున్నారు. అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న షరీఫ్ కుమార్తె వివాహం కూడా ఆగే పరిస్థితి ఉందని స్థానికులు విషాదం వ్యక్తం చేస్తున్నారు.

## మండలంలో భారీగా పోలింగ్

- అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు
- గతం కన్నా పెరిగిన శాతం


బెంగళూరు, హైదరాబాద్ నుంచి బస్సుల్లో వచ్చిన ఓటర్లు

మేదరమెట్ల, మే 15 : కొరిశపాడు మండలంలో సార్వత్రిక ఎన్నికలల్లో భారీగా పోలింగ్ జరిగింది. మండలంలోని 15 పంచాయతీలలో పురుషుల కన్న మహిళలే ఎ క్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ రోజు సోమవారం క్యూలైన్‌లలో భారీగా మహిళలే కనిపించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలల్లో అతి జాగ్రత్త వలన పోలింగ్ చాలా ఆలస్యంగా జరిగింది. రావినూతల, కుర్రవానిపాలెంలో రెండు ఈవీఎంలో గంట పాటు మొరాయించాయి. దైవాలరావూరులో అత్యధికంగా 90శాతం పోలింగ్ జరిగింది. మేదరమెట్ల పమిడిపాడు, రావినూతల గ్రామాల్లో కూడా ఓటింగ్‌లో మహిళలే ముందున్నారు. మండలంలోని మొత్తం 33,039 ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 15,949 మంది, మహిళలు 17,090 మంది పాల్గొనగా మండలంలో పురుషుల కన్నా 1141 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. మేదరమెట్లలో అత్యధికంగా 8,659 మంది ఓటర్లు ఉండగా వారిలో 7,091 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు కన్నా 303 మంది మహిళలు అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మేజర్ పంచాయతీ అయిన రావినూతలలో 5409 మంది ఓట్లు ఉండగా 4514 మంది ఓట్లేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా ఓటర్లే ముందంజలో ఉన్నారు. వాతావరణం చల్లబడడం కారణంగా ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపించారు. ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి చాలా మంది ఓటు హక్కును వినియోగించుకోవడానికి స్వగ్రామాలకు చేరుకున్నారు. వారిలో ఎక్కువ మంది ఉదయమే క్యూలైన్‌లో నిలబడి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో కొరిశపాడు మండలంలో తెలుగుదేశం పార్టీకి 2850 వరకు మెజారీ వచ్చింది. గతం కంటే పోలింగ్ అధికంగా జరగడం తమకు లాభిస్తుందని తెలుగుదేశం వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

### బాధ్యతతో వచ్చిన రావినూతల వాసులు

సార్వత్రిక ఎన్నికలల్లో తమ ఓటును వినియోగించుకోవడానికి పెద్ద సంఖ్యలో ఓటు వేయడానికి ఓటర్లు రావినూతలకు విచ్చేశారు. ఇతర దేశాలు, హైదరబాద్, బెంగళూరు వంటి నగరాల నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లు వేయడానికి తరలి వచ్చారు. రెండవ శనివారం ఆదివారం రావడంతో శుక్రవారం రాత్రి బయలుదేరి, శనివారం తమ సొంత వాహనాల్లో బయలు దేరి గ్రామాలకు చేరుకున్నారు.బస్సులలో సుమారు 500 మంది, సొంత వాహనాల్లో , వివిధ మార్గాల ద్వారా మరో 400 మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చారు. వీరిలో కొందరు మాట్లాడుతు రాష్టంలో అభివృద్ధి లేకపోవడం, కక్షపూరిత రాజకీయాలు సహించలేక ఓటు హక్కుతో సరైన అభ్యర్థులను ఎన్నుకునేందుకు వచ్చామన్నారు.